# మన క్రాంతి

KR TV

ఇది వాస్తవ పత్రిక...






Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 | సంచిక :60 | గురువారం , 30 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 | వెల: 3 రూ/-


## ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల




2లో

తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించిన కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 3న ఈసీ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అదే నెల 27న పోలింగ్ నిర్వహించి.. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం, అదే స్థానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా జరగనున్నాయి.

# 'ఏనుముల' ముత్యాలు

తెలంగాణ రాష్ట్రానికి ఆయన ముఖ్యమంత్రి. అంటే అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి. అలాంటి వ్యక్తికి కనీసం రాష్ట్రానికి సంబంధించి అవగాహన, ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. కానీ సీఎం రేవంత్ రెడ్డి పదేపదే తన అజ్ఞానాన్ని బయటపెడుతూ, తన అర్థంలేని మాటలతో రాష్ట్ర పరువు తీస్తున్నారు. రాష్ట్ర సమస్యల గురించి స్పష్టత లేకపోవడం, భౌగోళిక స్వరూపాన్ని సరిగా తెలియకపోవడం, అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటంయివి అన్ని కలిపి తెలంగాణ ప్రజలకు సిగ్గుపడే పరిస్థితిని కల్పిస్తున్నాయి. ఆయనకు అవగాహన, ప్రాథమిక పరిజ్ఞానం లేకున్నా కనీసం ఆయన దగ్గర ఉన్న పిఆర్ఓ లు కానీ సలహాదారులు కానీ సబ్జెక్టు ఉన్నవాళ్ళు ఉంటే బాగుండేది. ఇలాంటి మిడి మిడి జ్ఞానంతో రాష్ట్ర పరువు పోతుంది.

దావోస్ పెట్టుబడులపై సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టబోతున్నాయంటూ వాటి పేర్లను చదివి వినిపించారు. ఈ క్రమంలోనే అమెజాన్ వెబ్ సిరీస్, సింగపూర్‌కు చెందిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. దీంతో అందరూ ఆశ్చర్యపోయారు. అమెజాన్ వెబ్ సిరీస్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ రాష్ట్రానికి రావడం ఏంటని ముక్కున వేలేసుకున్నారు. అసలు విషయం ఏంటంటే.. సీఎం వాటిని తప్పుగా చదివారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ను కాస్తా ఆయన అమెజాన్ వెబ్ సిరీస్‌గా చదివారు. అంతేగాక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎడ్యుకేషన్‌గా చదివి నవ్వుల పాలయ్యారు.

ఇదిలా ఉంటే, పెట్టుబడులపై ఆయన చేసిన మరో వ్యాఖ్య కూడా నవ్వులు పూయించింది. కంపెనీలు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందాన్ని పెళ్లి చూపులు, లగ్న పత్రికతో పోల్చారు. "పెళ్లి చూపులు అయిపోయాయ్.. లగ్న పత్రిక రాసుకున్నాం. ఇగ మిగతా కార్యక్రమాలు అన్ని ముందున్నాయి. వాళ్లు మేము లగ్న పత్రిక రాసుకున్నాం" అని అన్నారు.



2లో

## మహాకుంభమేళాలో తొక్కిసలాట




హైదరాబాద్,29జనవరి (క్రాంతిన్యూస్ ): మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగింది. మౌని అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌లోని సెక్టార్ 2 సంగమం దగ్గరకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరగడంతో.. అక్కడ బారికేడ్లు విరిగిపోయాయి. దీంతో తొక్కిలాసట జరిగి పలువురు భక్తులకు తీవ్రంగా గాయాలయ్యాయి. అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది, పోలీసులు స్పందించి.. వారిని అంబులెన్సుల్లో సమీప ఆస్పత్రులకు తరలించారు. ఎంతమంది గాయపడ్డారనే అంశంపై క్లారిటీ రావాల్సి ఉంది. సంగమం దగ్గర రద్దీ పెరగడంతో తొక్కిసలాట జరిగిందని భక్తులు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత పుణ్యస్నానాలను రద్దు చేస్తున్నట్లు అఖండ పరిషత్ ప్రకటించింది.

2లో

## తెలంగాణలో దారుణం..

### పాఠశాలలో ఫుడ్ పాయిజన్: 61 మంది స్టూడెంట్స్



తెలంగాణలో దారుణం చోటు చేసుకుంది. కామారెడ్డి - ఎల్లారెడ్డి పట్టణ ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. ఇందులో దాదాపు 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అయితే ఇలా జరగడానికి కారణం.. విద్యార్థులకు పచ్చడితో అన్నం పెట్టడమేనని తెలుస్తోంది. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగిన వెంటనే పాఠశాల సిబ్బంది వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్**

ఇలాంటిదే రాష్ట్రంలో మరో ఘటన చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ కలకలం సృష్టించింది. ఫుడ్ వికటించడంతో వసతి గృహంలో ఉంటున్న 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు.

కొంతమంది విద్యార్థినులు వాంతులు చేసుకున్నారు. వెంటనే గమనించిన పాఠశాల సిబ్బంది అస్వస్థతకు గురైన బాలికలను సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు.

2లో

## టూరిజం పాలసీని సిద్ధం చేయాలి..

- సీఎం రేవంత్ రెడ్డి



2లో

హుస్సేన్ సాగర్ పరిసరాలలో గల అన్ని పార్కులను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ను అభివృద్ధి చేసే అంశాన్ని టూరిజం శాఖ అధికారులు పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం పర్యాటకశాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో టూరిజం పాలసీకి సంబంధించిన పలు అంశాలపై తీవ్ర చర్చ సాగింది.సమీక్ష అనంతరం అధికారులతో సీఎం మాట్లాడుతూ.. ఫిబ్రవరి 10 లోగా టూరిజం పాలసీని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. దేశ విదేశాల్లోని బెస్ట్ పాలసీలను అధ్యయనం చేసి, పాలసీని రూపొందించాలన్నారు. అలాగే విదేశీ పర్యాటకులను ఆకర్షించే విధంగా తెలంగాణ టూరిజం మరింత అభివృద్ధి చెందాలని సీఎం ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ 420 హామీలు..

### రేపు బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త నిరసనలు




2లో

కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ మరోసారి పోరుకు సిద్ధమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఇప్పటికె తీవ్ర విమర్శలు చేస్తున్న గులాబీ పార్టీ నాయకులు, వివిధ పద్ధతుల్లో రోజుకో రకమైన నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు పూర్తవుతుందని.. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు కూడా 420 వంటివే కావడం వల్ల వాటిని నెరవేర్చడం లేదని కారు పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.

## నేటిమాట

స్వాతంత్య్రం అంటే అందులో తప్పులు చేసే స్వేచ్ఛ కూడా ఉండాలి. అది లేనప్పుడు అసలు స్వాతంత్య్రం ఉన్నా లేనట్లే!



-మహాత్మా గాంధీ

## లొల్లాయి మల్లిపై

### ఉప్పల్ పీఎస్లో ఫిర్యాదు



3లో

## గులాబీ పార్టీకి ఏమైంది?

- ఎమ్మెల్సీ ఎన్నికలకు కారు దూరమా?
- షెడ్యూల్ విడుదలైనా కనిపించని హడావుడి!




ఉద్యమకాలం నుంచి నేటిదాకా, ఎన్నికలేవైనా, ఉప ఎన్నిక ఏదైనా.. పోటీకి సై అంటూ దూకుడుగా ముందుకొచ్చే గులాబీ పార్టీ.. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత.. ధోరణి మార్చేసినట్టు కనిపిస్తోంది. ఆచితూచి అడుగులు క్రాంతిన్యూస్ వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంపై ఇప్పటికే తీవ్రస్థాయిలో పోరాటం చేస్తూ.. మరోసారి శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్న బీఆర్ఎస్ పెద్దలు.. త్వరలో జరగునన్న ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో మాత్రం.. ఎటూ తేల్చలేకపోతున్నారు. ఏ ఎన్నికలైనా సవాల్‌గా తీసుకుని పోరాడే తెలంగాణ భవన్ ఉరఫ్ బీఆర్ఎస్ భవన్.. కీలకమైన మూడు ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదలైనా కామ్‌గానే ఉంది. పోటీకి దూరమన్నట్టుగా పార్టీ శ్రేణులకు సంకేతాలు పంపుతోంది.

2లో

## బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెడుతుందా?




బల్దియా రాజకీయం.. చాలా గ్యాప్ తర్వాత గరంగరం కాబోతోంది. జిహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం కోసం కత్తులు నూరుతున్నాయి మూడు ప్రధాన పార్టీలు. బీఆర్ఎస్ - కాంగ్రెస్ పార్టీలు బాహాబాహీకి రెడీ అంటున్నాయి. బీజేపీ కార్పొరేటర్లకు ఇప్పటికే దిశానిర్దేశం చేసి పంపింది రాష్ట్ర నాయకత్వం.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.. జిహెచ్ఎంసీ గురువారం జరిగే కీలకమైన కౌన్సిల్ సమావేశానికి సిద్ధమైంది. 2025-26 సంవత్సరానికి గాను 8,340 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ఆమోదించడమే ఎజెండా. కానీ.. అంతకుమించిన పొలిటికల్ అజెండాలో ఢీ అంటే ఢీ అంటున్నాయి మూడు ప్రధాన పార్టీలు. ముఖ్యంగా స్థానిక సమస్యలపై కౌన్సిల్‌లో గళం విప్పి జగడానికి సై అంటున్నారు విపక్ష కార్పొరేటర్లు. సో.. రాజకీయ రచ్చరచ్చ గ్యారంటీ అన్నమాట.

కాంగ్రెస్ కార్పొరేటర్లతో మేయర్ విజయలక్ష్మి ప్రత్యేకంగా సమావేశమై.. కౌన్సిల్‌లో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించారు. తలసాని సహా మిగతా బీఆర్ఎస్ నగర నేతలతో మాజీ మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు.

2లో

# ‘ఏనుముల’ ముత్యాలు

మొదటి పేజీ తరువాయి

దీంతో అక్కడున్న రిపోర్టర్లు గొల్లున నవ్వారు. అయితే తెలియని విషయాలను తెలుసుకోవడం, మానవుడి పరిజ్ఞానం పెంచుకోవడమనేది మినిమమ్ సెన్స్ అండ్ కామన్ సెన్స్ అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై సెటైర్లు పేలుతున్నాయి. అలాగే పదం బాగుంది కదా అని, దాన్ని వాడేసి, ఆ తర్వాత దాని అర్థం ఏంటో తెలుసుకుని అర్రే ఇట్లా అనకుండా ఉంటే బాగుణ్ణు అనుకోవడం కూడా పిచ్చితనం అంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనపైనే తాను జోకులు వేసుకుంటున్నారా సీఎం అన్న చర్చ జరుగుతుంది.

గత సంవత్సరం దావోస్‌లో పర్యటించిన రేవంత్ రెడ్డి ఇండియా టుడే చానెల్ కి ఇంటర్వ్యూ ఇస్తూ ‘న్యూక్లియర్ చైన్ రియాక్షన్’ అని చెప్పడం అపట్లో ట్రేడింగ్ అయ్యింది. ఈ సారి మరో చానెల్ తో ఇంటర్వ్యూ లో యాంకర్ అడిగిన ప్రశ్న పెట్టుబడులకోసం మీరు ఎలా సన్నద్ధం అయ్యారు అంటే అది ట్రేడ్ సీక్రెట్ అని చెప్పి అబాసు పాలయ్యారు. దావోస్‌లో ఏం చేస్తారో ముందే ప్రెస్ రిలీజ్‌లు ఇస్తారు.. అటువంటప్పుడు ట్రేడ్ సీక్రెట్ ఏంటి? అని అందరూ ఆశ్చర్య పోయారు.

## ‘ఏనుముల’ ముత్యాలు మచ్చుకు కొన్ని

1. తెలంగాణలో శ్రీశైలం?

రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ఏర్పాటు చేసిన ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్క్ ప్రారంభోత్సవంలో కూడా సీఎం మరోసారి తన అజ్ఞానాన్ని బయటపెట్టారు. తెలంగాణలోని ఆలయాలను ప్రస్తావిస్తూ, శ్రీశైలం ఆలయం రాష్ట్రంలోని దేవాలయమని చెప్పడం.

2. ట్యూబర్‌కులోసిస్ బదులు లెప్రసీ (కుష్టురోగ)..

వికారాబాద్‌ను లెప్రసీ (కుష్టురోగ) చికిత్స కేంద్రం అని అభివర్ణించడం పూర్తిగా అవాస్తవం. వాస్తవానికి వికారాబాద్ ట్యూబర్‌కులోసిస్ చికిత్సకు ప్రసిద్ధి. అలాగే గత

3. హైదరాబాద్ కి ముదువైపుల సముద్రం!

అక్టోబర్ లో వికారాబాద్‌లో వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రానికి శంకుస్థాపన సందర్భంగా.. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. హైదరాబాద్ నగరానికి, తెలంగాణకు మూడు వైపులా సముద్రం ఉన్నదని రేవంత్ వ్యాఖ్యానించారు.

4. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు!

దిల్‌సుఖ్‌నగర్‌లో విమానం కావాలన్నా కొనుక్కునే పరిస్థితులు వచ్చినాయి అని చెప్పి అబాసు పాలయ్యాడు.

5. ఎన్ఆర్ఐ

ఎన్ఆర్ఐ అంటే నాన్ రిలేబుల్ ఇండియన్ అని

6. ట్రాన్స్ఫార్మర్ మైన్టెన్ చేయాలి అంటే పవర్ ఆఫ్ చేసి, ఆ ట్రాన్స్ఫార్మర్ దించి ఆయిల్ చేంజ్ చేసి మళ్ళీ కొత్త ఆయిల్ పోయాలి అని పవర్ కట్స్ ఎందుకు ఉన్నాయో చెప్పడం కోసం చెప్పిన థియరి ఇది. వాస్తవంగా ట్రాన్స్ఫార్మర్ మైన్టెన్ చేసేటప్పుడు బాకప్ ట్రాన్స్ఫార్మర్ పెట్టి పాతది తీసి సర్వీస్ చేస్తారు.

7. ఒక సందర్భంలో గుడ్ల గూబ కాళ్ళు పైకి పెట్టుకొని పడుకుంటది అని అన్నాడు. వాస్తవంగా అలా పడుకునేది గుడ్ల గూబ కాదు గబ్బిలం

ఇలాంటి నిర్లక్ష్య వ్యాఖ్యలు చేసేవారే ఒక రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్నారని గుర్తుచేసుకుంటే, ప్రజలు ఆశ్చర్యపోక మానరు.

ఈ దౌర్భాగ్య పరిస్థితి ఏమిటంటే, తెలంగాణకు రాష్ట్ర భౌగోళిక స్వరూపం తెలియని, ప్రాథమిక పెట్టుబడుల జ్ఞానం లేని, అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర పరువు తీసే సీఎం లభించడం. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తికి కనీసం విషయ పరిజ్ఞానం ఉండాలి. కానీ రేవంత్ రెడ్డి మాటల నుంచి ఆయనకు ఎటువంటి స్పష్టతా, అవగాహనా లేదని స్పష్టంగా తెలుస్తోంది. ప్రజలు ఎప్పుడు సరైన నిర్ణయం తీసుకుంటారో, రాష్ట్రానికి నిజమైన నాయకత్వం ఎప్పుడు దొరకుతుందో చూడాలి!

# మహాకుంభమేళాలో తొక్కిసలాట

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటన గురించి సమావేశం తెలిసిన వెంనటే ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో మాట్లాడారు. మహా కుంభమేళాలో పరిస్థితి గురించి ఆరా తీశారు.. అక్కడి పరిణామాలపై వెంటనే సమీక్షించి, అవసరమైన తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. ఇదిలా ఉంటే.. అక్కడ పరిస్థితి అదుపులోనే ఉందని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆకాంక్ష రాణా తెలిపారు. క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో వైద్యం కొనసాగుతోందన్నారు.

ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళాలో మౌనీ అమావాస్యకు ప్రత్యేకత ఉంది. ఈ క్రమంలో భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో యూపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. జనవరి 13 నుంచి కుంభమేళా మొదలుకాగా.. ఇప్పటి వరకు 15కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు చెబుతున్నారు. అయితే మౌనీ అమావాస్య సందర్భంగా బుధవారం ఒక్కరోజే 10 కోట్లకుపైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారుల అంచనా.. అందుకే త్రివేణీసంగమ ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు అధికారులు. మౌనీ అమావాస్య సందర్భంగా రైల్వేశాఖ మొత్తం 360 రైళ్లను కూడా నడుపుతున్నారు.

ఈ క్రమంలో యూపీ ప్రభుత్వం 1 నుంచి 8 తరగతుల స్థానిక విద్యార్థులకు మూడు రోజులు (జనవరి 28, 29, 30) సెలవులు ప్రకటించింది. అంతేకాదు మౌనీ అమావాస్యకు అలహాబాద్ హైకోర్టు సైతం బుధవారం సెలవుగా ప్రకటించింది. ఈ సందర్భంగా అధికారులు భక్తులకు కొన్ని ప్రత్యేక సూచనలు చేశారు. భక్తులు నిర్దేశించిన మార్గాల్లోనే ఘాట్‌లకు వెళ్లాలని, స్నానాల తర్వాత గుంపులుగా గుమికూడి ఎక్కువసేపు ఉండవద్దని రిక్వెస్ట్ చేశారు. భద్రతా నియమాలు పాటించి తమతో సహకరించాలి అన్నారు.

ప్రయాగరాజ్‌లోని మహా కుంభమేళా లో మౌని అమావాస్య పవిత్ర స్నానాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మంది మృతి చెందగా, 36 మంది గాయపడ్డారు. ఈమేరకు ఉత్తరప్రదేశ్ పోలీసులు బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధికారికంగా ప్రకటించారు. మౌని అమావాస్య పవిత్ర స్నానాలకు సంగం నది దగ్గరకు ఇసుకవేస్తే రాలనంతగా భక్తులు తరలివచ్చారు. రెండో సాహి స్నాన్ కోసం మంగళవారం రాత్రి నుంచే భక్తులు పెద్దఎత్తున సంగం నది వద్దకు చేరుకున్నారు. ఒక్కసారిగా ఊహించని సంఖ్యలో భక్తులు రావడంతో తొక్కిసలాట జరిగింది.

## మృతులపై డీఐజీ ప్రకటన

ఘటనపై మహాకుంభ్‌నగర్ డీఐజీ వైభవ్ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ, మహాకుంభ్ తొక్కిసలాటలో 30 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. తెల్లవారుజామున 1-2 గంటల మధ్య ఈ ఘటన జరిగిందని తెలిపారు. మృతుల్లో 25 మంది గుర్తించామని, మరో ఐదుగురిని గుర్తించాల్సి ఉందని వివరించారు. మృతుల్లో ఇతర రాష్ట్రాలు వారు కూడా ఉన్నారని, నలుగురు కర్ణాటక, ఒకరు అస్సాం, ఒకరు గుజరాత్‌కు చెందిన వారున్నట్టు చెప్పారు. గాయపడిన 36 మంది స్థానిక మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ నెంబర్ 1920 అందుబాటులో ఉందని చెప్పారు. అఖాడా ప్రాంతానికి భక్తులు పెద్దఎత్తున రావడం, కొందరు తమ వంతు వచ్చేంతవరకూ వేచిచూసేందుకు అక్కడే పడుకోవడం, వారి మీద నుంచి భక్తులు పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగిందని వివరించారు.

## మోదీ ప్రగాఢ సానుభూతి

మహాకుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తీవ్ర విచారం వ్యక్తంచేశారు. గాయపడివారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు ప్రధాని మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో మాట్లాడి ఎప్పటికప్పుడు సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. మౌనీఅమావాస్య సందర్భంగా కోట్లాది మంది భక్తులు తరలివచ్చినట్లు చెప్పారు. తొక్కిసలాట కారణంగా కొంతసేపు స్నానాలు నిలిపివేసినట్లు చెప్పిన ప్రధాని మోదీ ఆ తర్వాత పుణ్యస్నానాలు తిరిగి ప్రారంభమైనట్లు తెలిపారు.

## జ్యుడీషియల్ కమిషన్? ఏర్పాటు - యోగీ ఆదిత్యనాథ్

ఈ ఘటన హృదయ విదారకంగా ఉంది. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలందరికీ మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము. ఈ ఘటనపై జ్యుడీషియల్ కమిషన్? ఏర్పాటు చేశాం. గత రాత్రి నుంచి అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. కుంభమేళా అథారిటీ, పోలీస్?, పరిపాలనా యంత్రాంగం, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు - తాము చేయగలిగేవన్నీ చేస్తున్నాయి.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

మొదటి పేజీ తరువాయి

ఈ రెండింటితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగుతాయి. మార్చి 29న రెండు ఉపాధ్యాయ, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్ విడుదల తేదీ: ఫిబ్రవరి 3

నామినేషన్ ప్రక్రియ: ఫిబ్రవరి 3 నుంచి 10 వరకు

నామినేషన్ల పరిశీలన: ఫిబ్రవరి 11

నామినేషన్ ఉపసంహరణకు గడువు: ఫిబ్రవరి 13

పోలింగ్: ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు

ఓట్ల లెక్కింపు, ఫలితాలు: మార్చి 3

కాగా, జనవరి 1న ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం.. కరీంనగర్ పట్టభద్రుల ఓటర్లు 3,41,313గా, టీచర్లు 25,921 ఓటర్లుగా ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఓటర్లు 3,41,313 మంది, ముగ్గురు థర్డ్ జెండర్లు, ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది ఉన్నారు. ఓటర్ల సంఖ్య క్రమంలో పట్టభద్రులకు సంబంధించి 499, ఉపాధ్యాయ ఓటర్లకు 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇక, పట్టభద్రులు, టీచర్ ఓటరు నమోదులో కరీనగర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.

పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి 15 జిల్లాలుండగా.. పట్టభద్రులకు సంబంధించిన కరీంనగర్ అత్యధికంగా 69,657 మంది నమోదు చేసుకున్నారు. అత్యల్పంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేవలం 2,420 మంది మాత్రమే ఉండటం విశేషం.

ఇక, ఉపాధ్యాయ ఓటరు నమోదులో 4,020 మంది నమోదు చేసుకోగా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి అత్యలప్పంగా 81మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. నిజామాబాద్, సిద్దిపేటలు కరీంనగర్ తరువాత స్థానాల్లో నిలిచాయి. సాధారణ ఓటరు జాబితాలో మహిళలే అధికంగా ఉండగా.. ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పురుషుల కంటటే సగానికి ఉండటం గమనార్హం.

# బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెడుతుందా?

జిహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశానికి కత్తులు నూరుతున్న ప్రధాన పార్టీలు

ఇటు.. కిషన్‌రెడ్డి నేతృత్వంలో సమావేశమైన బీజేపీ కార్పొరేటర్లు కాంగ్రెస్-బీఆర్ఎస్‌లను ఇరుకున పెట్టడానికి యాక్షన్ ప్లాన్ రాసుకున్నారు. ప్రజాసమస్యలపై పూర్తి స్థాయి చర్చ జరపకపోవడాన్ని మేయర్ పరిపాలనా వైఫల్యంగా చెబుతోంది బీజేపీ.

గతంలో కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ల మధ్య ఘర్షణ జరిగి, తోపులాటకు దారితీసింది. అందుకే.. ఈసారి ముందుజాగ్రత్తగా కౌన్సిల్ హాల్ నుంచి జీహెచ్ఎంసీ మెయిన్ గేట్ వరకూ మొత్తం పోలీసుల పహారాలోకి వెళ్లింది. ఫిబ్రవరి 11తో గవర్నింగ్ బాడీకి నాలుగేళ్ల పదవీకాలం పూర్తవుతుండడం, మేయర్-డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్ ప్లాన్ చేయడం.. ఇవన్నీ కలిపి కౌన్సిల్ సమావేశంపై సహజంగానే ఫోకస్ పెంచేశాయి.

మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్, సర్వసభ్య సమావేశంలో అధికార పక్షం విరుచుకుపడేందుకు ప్రతిపక్ష బీజేపీ కత్తులు దూస్తోంది. గ్రేటర్ సమస్యలపై బల్దియా మీటింగ్ లో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీజేపీ కార్పొరేటర్లకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు బీజేపీ ఎంపీ లక్ష్మణ్, ఆర్గనైజేషనల్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ గ్రేటర్ కార్పొరేటర్లతో పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని సమస్యలపై కలిసి కట్టుగా పోరాటం చేయాలని.. దూకుడుగా వెళ్లాలని ఎంపీ లక్ష్మణ్ సూచించారు. గ్రూపులు కట్టి ప్రజా సమస్యలపై పోరాటాలను విచ్ఛిన్న చేసుకోవద్దని క్లాస్ పీకారు. బల్దియా ఎన్నికలకు ఏడాదే సమయం ఉన్నందున్న మరింత ఫోకస్ట్ గా ప్రభుత్వంపై పోరాడాలని కార్పొరేటర్లకు చెప్పారు.

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ గ్రౌండ్ కేటాయిస్తూ జీహెచ్ఎంసీ జనరల్ బాడీ మీటింగ్ లో ప్రవేశ పెట్టే తీర్మానాని వ్యతిరేకించాలని బీజేపీ నిర్ణయించింది. అత్యంత రద్దీ, ఇరుకుగా ఉండే రోడ్ల మధ్య గోషామహల్ స్టేడియంలో ఆస్పత్రి నిర్మాణం వద్దని.. పాత ఉస్మానియా ఉన్న ప్రాంగణంలోనే ఆస్పత్రి నిర్మించాలని కమలనాథులు డిమాండ్ చేస్తున్నారు. ఎంఐఎం నేతలు సూచించిన స్థలంలో కావాలని ప్రభుత్వం గోషామహల్ స్టేడియంలో నిర్మిస్తుందని బీజేపీ ఆరోపిస్తోంది. బీజేపీ కార్పొరేటర్ల డివిజన్లలో అభివృద్ధి పనులకు మేయర్, అధికారులు సహకరించడం లేదని.. ఈ వైఖరిని నిరసిస్తూ బల్దియా బడ్జెట్ ను వ్యతిరేకిస్తామన్నారు.

మరోవైపు బీజేపీ గ్రేటర్ కార్పొరేటర్ల సమావేశంలో సమన్వయం లోపంపై తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కార్పొరేటర్లు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. అందరూ కలిసి పనిచేస్తేనే పట్టు ఉంటుందని.. పార్టీకి బలం పెరుగుతుందని హితబోధ చేశారు. కార్పొరేటర్లు పార్టీ కార్యక్రమాల్లో ఇన్వాల్వ్ కావడం లేదని చంద్రశేఖర్ తివారి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రేటర్ లో ప్రజాసమస్యలతో పాటు పార్టీ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు విధిగా పాల్గొనాలని హితబోధ చేశారు. హైదరాబాద్ లో ప్రజలకు, పార్టీకి మధ్య అనుసంధానకర్తలు కార్పొరేటర్లేనని.. దానికి తగ్గట్టు డివిజన్ల వారీగా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

జీహెచ్ఎంసీలో బీజేపీ ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్ తీరుపై కొందరు కార్పొరేటర్లు రాష్ట్ర నేతలకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. బల్దియాలో ఎలాంటి కార్యక్రమాలు చేపడదామన్న ఫ్లోర్ లీడర్ అడ్డుపడుతున్నారని లక్ష్మణ్ దృష్టికి పలువురు కార్పొరేటర్లు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన లక్ష్మణ్.. ఇకపై కలిసి కట్టుగా దూకుడుగా పోరాటాలు చేయాలని.. అందరూ సమన్వయంతో ముందుకెళ్లాలని వారికి చెప్పారు. హైదరాబాద్ లో ఏడాదిలో జరిగే ఎన్నికలే టార్గెట్ గా ఇప్పటి నుంచి కార్పొరేటర్ల కార్యాచరణ ఉండాలని.. అందుకు పార్టీ నుంచి సంపూర్ణం సహకారం ఉంటుందని నేతలు కార్పొరేటర్లకు హామీ ఇచ్చారు.బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో మేయర్ పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెట్టే అంశం చర్చకు వస్తుందని అంతా భావించారు. కానీ అలాంటి చర్చ రాక పోగా.. బీజేపీకి బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు సమదూరమని రాష్ట్ర నేతలు కార్పొరేటర్లకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఆ మూడు పార్టీలు ఒకతాను ముక్కలని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. బీఆర్ఎస్ అవిశ్వాసం పెట్టదని.. పెట్టినా తమ మద్దతు ఉండబోదని బీజేపీ ఇన్ డైరెక్ట్ గా సంకేతాలు ఇచ్చింది.




# కాంగ్రెస్ 420 హామీలు..

## రేపు బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త నిరసనలు

మొదటి పేజీ తరువాయి




ఈ నేపథ్యంలో రేపు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు, ఆ పార్టీ శ్రేణులు వినూత్న రీతిలో నిరసనలు, ధర్నాలకు దిగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రేపు జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పిస్తూ.. ఆయా చోట్ల గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు ఇవ్వనున్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం రాయిలాగా ఉందని, ప్రజా సమస్యలపై ఎన్నిసార్లు తెలిపినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని.. అందుకే విగ్రహాలకు వినతి పత్రాలు ఇస్తున్నామని ఆ పార్టీ వెల్లడించింది. దీంతో అయినా కాంగ్రెస్ నాయకులకు, ఆ పార్టీకి కళ్ళు తెరుచుకోవాలని ఆశిస్తున్నామని తెలిపారు. కాగా గత సోమవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్వీ కాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం హయాంలో తెలంగాణ ను దేశానికి దిక్సూచిలా తీర్చిదిద్దామని అన్నారు. వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 5 మెడికల్ కాలేజీలను 33కు పెంచామని అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. 420 హామీలతో గెలిచి 15 నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. అందుక నిరసనగా జనవరి 30న గాంధీ విగ్రహానికి వినతి పత్రాలు ఇస్తామని అన్నారు. డూప్లికేట్ గాంధీలకు బుద్ధి వచ్చేలా చేయాలని ఆ మహాత్ముడిని కోరుతామని సెటైర్లు వేశారు.

# తెలంగాణలో దారుణం.. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ :61 మంది స్టూడెంట్స్

ఇక ట్రీట్మెంట్ పొందుతున్న బాలికలను ఆర్డీవో, వైద్యాధికారి పరామర్శించారు. ఈ మేరకు అస్వస్థకు గురైన బాలికల ఆరోగ్యం ఇప్పుడు నిలకడగానే ఉన్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. . .

## నారాయణపేటలో 25 మంది విద్యార్థులు

దీంతోపాటు నారాయణపేట జిల్లాలో బాలుర ఉన్నత పాఠశాలలో భోజనం వికటించి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నారాయణపేట జిల్లా ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి సుమారు 25 మంది విద్యార్థులు వాంతులు కడుపునొప్పితో ఇబ్బంది పడ్డారు. దీంతో గమనించిన పాఠశాల సిబ్బంది హుటాహుటిన వైద్యులను పాఠశాలకు పిలిపించి వైద్యం అందించారు.

# గులాబీ పార్టీకి ఏమైంది?

## ఎమ్మెల్సీ ఎన్నికలకు కారు దూరమా? షెడ్యూల్ విడుదలైనా కనిపించని హడావుడి!

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై ఇప్పటికే ప్రధాన పార్టీలు దృష్టి పెట్టాయి. అయితే, మొన్నటి దాకా రాష్ట్రంలో అధికారం చలాయించిన బీఆర్ఎస్ మాత్రం ఈ ఎన్నికలకి దూరంగా ఉండే అవకాశాలు కనబడుతున్నాయి. ఇప్పటికే పలువురు ఆశావాహులు సొంతంగా ప్రచారం నిర్వహిస్తున్నా.. పార్టీ నుంచి మాత్రం ఎక్కడా అధికారిక సమావేశం జరగలేదు. ఉత్తర తెలంగాణలో 40 నియోజకవర్గాలను కవర్ చేసే ఈ ఎమ్మెల్సీ స్థానంలో.. బీఆర్ఎస్‌కు గట్టిపట్టే ఉంది. ప్రతీ ఎన్నికల్లో కారు దూకుడు.. ఒక రేంజ్‌లో కనిపించేది. ఒకరకంగా చెప్పాలంటే పార్లమెంటు ఎన్నికల తరువాత తెలంగాణలో ఇది అత్యంత కీలకమైన ఎన్నికగా చెప్పొచ్చు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుల నియోజకవర్గాలు సైతం.. ఈ ఎమ్మెల్సీ పరిధిలోనే ఉన్నాయి. అయినా సరే, పోటీ విషయంలో మాత్రం ఆ పార్టీ స్పష్టత ఇవ్వడం లేదు.ఇప్పటికే భారతీయ జనతా పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించింది. కాంగ్రెస్ కూడా అన్నివిధాలా సన్నద్ధమవుతోంది, రేపోమాపో అభ్యర్థిని ప్రకటించి కార్యక్షేత్రంలోకి దిగబోతోంది. అయితే, బీఆర్ఎస్‌లో మాత్రం చడీచప్పుడు లేదు. నామమాత్రపు చర్చ కూడా పార్టీలో జరగడం లేదంటే.. ఈ ఎన్నికల్లో గులాబీ దళం పోటీకి దూరంగా ఉండబోతోందని స్పష్టమవుతోంది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కూడా.. మాటవరసకైనా ఎమ్మెల్సీ ఎన్నికల ఊసెత్తలేదు. నేతలతోనూ చర్చించలేదు. ఆశావాహులు తనను కలిసి, అవకాశం ఇవ్వాలని కోరినా, ఎలాంటి సమాధానం ఇవ్వలేదట.ఈ మూడు స్థానాల పరిధిలో.. బీఆర్ఎస్‌కు భారీగా ఆశావహులున్నారు. వేల సంఖ్యలో మద్దతుదారులు ఉన్నారు. మరి, పార్టీ పోటీకి దూరంగా ఉంటే.. వాళ్లంతా ఎవరికి మద్దతు ఇవ్వాలో తెలియని పరిస్థితి. మద్దతుదారులు ఓకే.. ఆశావహుల పరిస్థితే అగమ్యగోచరంగా మారేలా ఉంది. పార్టీ హైకమాండ్ సంకేతాలతో కొందరు సైలెంట్‌గా ఉంటే.. మరికొందరు మాత్రం ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. పార్టీ ఇన్వాల్వ్‌మెంట్ లేకుండానే.. ఎన్‌రోల్‌మెంట్ చేయించారు. అయితే, వరుస పోరాటాలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న బీఆర్ఎస్.. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెనకడుగు వేయడం ఆ పార్టీ శ్రేణుల్ని తీవ్రంగా నిరుత్సాహపరుస్తోందట. దూకుడు మీదున్నప్పుడు సడెన్‌గా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పార్టీకి మైనస్ అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓడినా, గెలిచినా పోటీచేసి తీరాలని మెజార్టీ నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కచ్చితంగా ప్రభావం చూపుతాయి. కాబట్టి, గెలిచి తీరాలన్న సంకల్పంతో కాంగ్రెస్, బీజేపీలు పనిచేస్తున్నాయి. మరి, పోటీ విషయంలో బీఆర్ఎస్ వెనక్కి తగ్గడం నిజమే అయితే.. ఆ పార్టీ మంచి అవకాశాన్ని వదులుకున్నట్టేనన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. రెండు జాతీయ పార్టీలు సై అంటుంటే.. రాష్ట్రంలో బలమైన ఒకేఒక్క స్థానిక పార్టీ బీఆర్ఎస్ మాత్రం నై అంటుండటం ఆసక్తి రేపుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..!

# లొల్లాయి మల్లిపై ఉప్పల్ పీఎస్లో ఫిర్యాదు




క్రాంతిన్యూస్ / ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘం మహిళలు ఉప్పల్ పోలీస్ స్టేషన్లో ఎస్సై నరేందర్ కు ఫిర్యాదు చేశారు. నిన్న జరిగిన బీసీ సంఘం ఉద్యోగుల సమ్మేళనానికి వెళ్లిన తీన్మార్ మల్లన్న రెడ్డి కులాన్ని, రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరుస్తూ మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండి రెడ్డిలను కుక్కలతో పోల్చిన తీన్మార్ మల్లన్నపై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కులాల మధ్య కుంపట్లు, మతాల మంటలు పెడుతున్న ఇలాంటి వారు నాయకులుగా ఉండడం సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి వాళ్లను కాంగ్రెస్ పార్టీ వెంటనే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న ప్రతి మీటింగ్ లో ఇలానే రెడ్డిలను టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నాడని, ఇది ఎట్టి పరిస్థితుల్లో సమ్మతించదగ్గ విషయం కాదన్నారు. మల్లన్న వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సామాజిక వర్గాన్ని అప్రతిష్ఠపరిచేలా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే ఖచ్చితంగా ప్రతిస్పందిస్తాం. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు బాధ్యతారహితంగా ఉన్నాయి. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని వారు పేర్కొన్నారు.

**రెడ్డిలను కుక్కలతో పోల్చిన తీన్మార్ మల్లన్న**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీ ఉద్యోగస్తుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సామాజిక వరగంపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు.

పిఆర్టియు అంటే ప్రోగ్రెసివ్ రెడ్డి టీచర్స్ యూనియన్ అని చెప్పిన నేను దాని పేరు 13 జిల్లాలు ఈ ఏరియాలు పట్టకుంటే 13కి 13 అప్పర్ కాస్ట్ రెడ్లే మొత్తం అధ్యక్షులు జిల్లాల అధ్యక్షులు ఈ కుక్కల సంఘం అధ్యక్షులు లెక్క మొత్తం రెడ్లే కుక్కల సంఘం అధ్యక్షుల లెక్క మొత్తం రెడ్లే అని రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరిచాడు. రెడ్డి కులస్తులు ఓట్లు మాకు వద్దు. వారి ఓట్లు వాళ్ళే వేసుకోవాలి. ఎందుకంటే వారితో మాకు సోపతి తక్కువ. అలాంటప్పుడు మేము బతిమిలాడినప్పటికీ మాకు ఓట్లు వేయరు.. అలాంటప్పుడు ఓట్లు అడిగి కూడా వృధానే. అందువల్లే రెడ్డి కులస్తుల ఓట్లు మాకు వద్దు. మా బీసీల ఓట్లు మాత్రమే మాకు సరిపోతాయి. మా బీసీలు సంఘటితంగా ఉంటే సరిపోతుంది. వేరే వాళ్ళ ఓట్లు మాకెందుకు. వాళ్ల ఓట్లతో మేము అధికారంలోకి వచ్చేది ఏమైనా ఉందా? వాళ్లు మొదటి నుంచి అధికారానికి అలవాటు పడ్డారు. అధికారం దక్కించుకోవడం కోసం ఏమైనా చేస్తారు. ఇప్పటివరకు వాళ్లే ముఖ్య పదవులను అనుభవించారు. వాళ్ల జనాభా ఎంత ఉందో అందరికీ తెలుసు. అయినప్పటికీ మిగతా సమాజాన్ని మొత్తం వారు పరిపాలిస్తున్నారు.. ఇది సరైన విధానమా? రాజ్యాంగం ఇదే చెబుతోందా? రాజ్యాంగాన్ని అనుసరించే వాళ్లంతా దీనిని సమర్థిస్తారా" అని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు..

# నానమ్మ కళ్లలో ఆనందం కోసం హత్య..!!

## కారులో మృతదేహంతో రాత్రంతా షికారు..!!!



సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం వెలుగుచూసిన పరువు హత్య కేసులో ఆరుగురి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలు భార్గవి ఇద్దరు సోదరులు (నవీన్, వంశీ), నానమ్మ (బుచ్చమ్మ), నాన్న (సైదులు)తో పాటు నవీన్ స్నేహితులు (మహేశ్, సాయి చరణ్)ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుల నుంచి కారు, 5 సెల్‌ఫోన్లు, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేటలోని మామిళ్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ, కోట్ల భార్గవి అనే యువతి ఆరు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇంట్లో వారికి ఇష్టం లేకుండా తమ సోదరి కులాంతర వివాహం చేసుకోవడంతో రెండు నెలలుగా కృష్ణను అంతం చేసేందుకు భార్గవి సోదరులు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. పక్కా ప్లాన్ ప్రకారం కృష్ణను ఆదివారం హత్య చేయగా సోమవారం ఉదయం పిల్లలమర్రి కాల్వకట్టపై మృతదేహం లభ్యమైంది. కృష్ణను చంపేందుకు గతంలోనే 3 సార్లు ప్రయత్నించారని దర్యాప్తులో తేలింది. జిల్లా ఎస్పీ సన్?ప్రీత్ సింగ్ ఈ వివరాలు మీడియాకు వెల్లడించారు. వడ్లకొండ కృష్ణను హత్య చేసేందుకు అతని భార్య భార్గవికి చెందిన కుటుంబ సభ్యులు నలుగురితో పాటు మరో ఇద్దరు పాల్గొన్నారు. సూర్యాపేటలోని జనగామ క్రాస్ రోడ్డు సమీపంలోని నిందితుల్లో ఒకరైన బైరు మహేశ్ వ్యవసాయ భూమి వద్ద ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో హత్య చేశారు.

నానమ్మ బుచ్చమ్మ హస్తం.. ఈ హత్యలో ప్రధాన నిందితుని నానమ్మ బుచ్చమ్మ హస్తం ఉన్నట్లు గుర్తించి పోలీసులు అవాక్కయ్యారు. మనువరాలు భార్గవి ప్రేమ పెళ్లి ఆమెకు ఇష్టం లేదు. దీంతో కొద్ది నెలలుగా తన కుమారుడు, మనవళ్లను రెచ్చగొడుతూ హత్యకు పరోక్షంగా కారణమైయ్యారు.

హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని కారులో వేసుకొని ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేటలో బంధువుల ఇంటి వద్ద ఉన్న బుచ్చమ్మకు చూపించి సంతృప్తి పరిచారు..!! అనంతరం కారు డిక్కీలో మృతదేహం తీసుకుని నల్గొండ వరకు వెళ్లారు. దాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించగా ఏ ఆలోచన తట్టకపోయేసరికి చివరకు మృతదేహాన్ని పిల్లలమర్రి కాల్వకట్టపై పడేశారు.

# జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

ములుగు జిల్లా ప్రతినిధి,29 జనవరి (క్రాంతిన్యూస్ ):ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సివిల్ సప్లై మహేందర్ జి, సివిల్ సప్లై డిఎం రాంపతి ల చేతుల మీదుగా ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరినాథ్, ఉపాధ్యక్షులు అక్కల రఘోత్తం , రైస్ మిల్లర్లు రేపాల సత్యం, ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ములుగు జిల్లా రైస్ మిల్లర్లకు శుభాకాంక్షలు తెలియజేసినారు



# సినిమా ఇండస్ట్రీకి పండుగగా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్

## : మాజీ మంత్రి హరీష్ రావు




**హైదరాబాద్,జనవరి29(క్రాంతిన్యూస్):** సౌమిత్ మీడియా, మోర్దు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ కార్యక్రమం సినిమా పరిశ్రమకు నిజమైన పండుగ అని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో ఈ ప్రెస్టీజియస్ ఈవెంట్‌కు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, "సినిమా ఇండస్ట్రీలో విశేష ప్రతిభను ప్రదర్శిస్తున్న కళాకారులను గుర్తించి, వారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి కృషికి గౌరవ సూచకంగా అవార్డులు అందజేయడం నిజంగా అభినందనీయం. ఇలాంటి మహత్తరమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సౌమిత్ మీడియా అధినేత డాక్టర్ వంశీకృష్ణ, మోర్దు స్వచ్ఛంద సంస్థ అధినేత శ్రీనివాస్‌లకు నా హృదయపూర్వక అభినందనలు. కళాకారుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి శ్రమను అంగీకరిస్తూ నిర్వహించే ఈ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం సినీ ప్రియులకు, కళాకారులకు ఒక విశిష్టమైన వేదికగా నిలుస్తుంది" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీజీ 24 టీవీ అధినేత మహమ్మద్ యాసిఫ్ పాషా, వైబ్ మీడియా అధినేత శ్రీధర్ యాలాల, , నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రిక ఎడిటర్ గౌడిశాల సోమన్న, విజయచిత్ర ఎడిటర్ విజయ్, ఈవెంట్ బ్రాండ్ అంబాసిడర్ మీను సింగ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్తమ సినిమాలకు ప్రాముఖ్యతనిచ్చేలా, సినీ పరిశ్రమలో ఉన్న అద్భుతమైన టాలెంట్‌ను గుర్తించేందుకు ఒక ప్రత్యేకమైన వేదిక అందుబాటులోకి రావడం అభినందనీయమని హరీష్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భారతీయ సినీ పరిశ్రమ మాత్రమే కాక, అంతర్జాతీయంగా కూడా సినీ కళాకారులను, దర్శక నిర్మాతలను ఆకర్షించేలా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇలాంటి విశిష్టమైన సినీ వేడుకలు మరింత మంది ప్రతిభావంతులైన కళాకారులకు స్ఫూర్తినిస్తాయని, వారి కృషికి గుర్తింపు కల్పించేందుకు మరిన్ని అవకాశాలను కల్పిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# సకాలంలో వేతనాలు చెల్లించాలి

**జాతీయ ఉపాధి హామీ అధికారుల వేడుకోలు**

**ఎంపీడీవో కి వినతి పత్రం అందజేత**



వెంకటాపూర్,29 జనవరి (క్రాంతిన్యూస్):సకాలంలో వేతనాలు చెల్లించి ఆర్థికపరమైన ఇబ్బందుల నుండి తప్పించాలని జాతీయ ఉపాధి హామీ అధికారులైన వెంకటాపూర్ మండల ఏపీవో, ఈసీ, ఎఫ్ఏలు మండల ఎంపీడీవోకి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఏపీవో మాట్లాడుతూ ప్రభుత్వం గత రెండు నెలల నుండి వేతనాలు చెల్లించక ఆర్థికపరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టి వేతనాలు విడుదల చేయాలని మరియు ప్రతి నెల ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలని పేర్కొన్నారు. జాతీయ ఉపాధి హామీ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి మరి అమ్మేస్తున్నారు

**వనందాసు గడ్డ సర్వే నెం.20పై సమగ్ర విచారణ జరపాలి**

**కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి**

**వనందాసు గడ్డ గిరిజనులు**



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,29 జనవరి (క్రాంతిన్యూస్ ):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ గ్రామం 11వ వార్డు వనందాసు గడ్డ ప్రాంతంలో గల సర్వే నంబర్ 20లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోందని స్థానిక గిరిజనులు బుధవారం ఎమ్మార్వో పుల్లయ్యకు ఫిర్యాదు సమర్పించారు. స్థానిక గిరిజనేతరుడైన అంగూరు సురేష్ అనే వ్యక్తి స్థానిక ప్రజాప్రతినిదులు , బడా వ్యాపారస్తులతో చేతులు కలిపి పట్టపగలే జెసిబి సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించి ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే కొన్ని ప్లాట్లు చేసి అమ్మగా మరికొన్ని సిద్ధం చేస్తున్నారని తెలిపారు. స్థానిక పేద గిరిజనులకు ఇల్లు కట్టుకునే స్థలమే లేక ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తాము కోల్పోయామని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. సదరు భూమిని కబ్జాదారుల చెర నుండి విడిపించి స్థానిక వనందాసు గడ్డ పేద గిరిజనులకు ఇంటి స్థలంగా కేటాయించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్టు వారు చెప్పారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని, ఆపై కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదు సమర్పించిన వారిలో బానోత్ చందర్ నాయక్, భూక్య మహేష్, బానోత్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు లబ్దిపొందడం కోసం విస్తృత ప్రచారం నిర్వహించాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కోసం, తద్వారా లబ్దిపొందడం కోసం విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన 2025 సంవత్సర నూతన క్యాలెండరును మంత్రి హైదరాబాద్ లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డైరెక్టర్, డి .యస్. జగన్, డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

# గో బ్యాక్ సోలార్ ప్రాజెక్ట్ అంటున్న గూడూరు ప్రజలు...




కమలాపూర్ మండల పరిధిలోని గూడూరు గ్రామపంచాయతీ ఆధీనంలోని 143 సర్వేనెంబర్ లో గల భూమిలో సోలార్ ప్రాజెక్ట్ పెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో గూడూరు గ్రామ పెద్దలు, యూత్ గ్రామ ప్రజలు దాన్ని వ్యతిరేకిస్తున్నారు... ఇప్పటికే గ్రామానికి సంబంధించిన భూమిలో పలు విద్యాసంస్థలు నిర్మించారని వాటి వలన ఎటువంటి ప్రయోజనం పొందకపోగా భూమిని కోల్పోయి తీవ్ర నష్టం కలిగిందని. ఇళ్ల స్థలాలు లేకుండా ఉన్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రజలను ఆదుకోవాలని ఈ స్థలంలో ఇప్పటికే ఐకెపి సెంటర్ ఉందని గూడూరు క్లస్టర్ కింద ఉన్న చుట్టుపక్కల గ్రామాల రైతులకు వడ్లు ఆరబోసుకోవడానికి స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు... గూడూరు లోని యువకులు గ్రౌండ్ లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు... పోలీసు ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తున్న యువకులకు గ్రౌండ్ లేక వ్యాయామాలకు వామపులకు ఇబ్బందిగా ఉందని దానికోసం మినీ గ్రౌండ్ కావాలని కోరుకుంటూ ఈ స్థలంలో ఎటువంటి సోలార్ ప్రాజెక్టును నిర్మించకూడదని గ్రామ కార్యదర్శికి మండల తహసిల్దార్ కి పంచాయతీరాజ్ ఎంపీడీవో కి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే భూములు కోల్పోయి తీరని నష్టాన్ని ప్రభుత్వం కలిగించిందని ఇందులో మాజీ ఉపసర్పంచ్ పాక కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ పాక లక్ష్మీ రవీందర్, టిఆర్ఎస్ గ్రామ ప్రెసిడెంట్ సంగని సాంబయ్య , మాజీ వార్డ్ మెంబర్ నరిగే రాజకుమార్, మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి బాబు,టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి శెట్టి శేఖర్, వంగ అశోక్, గ్రామ యూత్ సభ్యులు కుమ్మరి ప్రకాష్, పునం, శివ, అఖిల్, రామకృష్ణ,శివ, శ్రీకాంతు,శివ తదితరులు పాల్గొని ఇకపై ఇటువంటివి సహించేది లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు....



# కృత్రిమ మేధను అందిపుచ్చుకోవాల్సిందే

## పరిశోధనాంశాలను వెల్లడించిన బ్రిటన్ షెఫీల్డ్ విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ ప్రీతి రఘునాథ్



అధునాతన పరిజ్ఞానాలైన కృత్రిమమేధ (ఏఐ), ఆర్టిఫీషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)లను భారతీయులు కూడా అందిపుచ్చుకోవాలని, అత్యంత ఖర్చు, వ్యయప్రయాసలతో కూడినదైనా దానిని వదులుకోకూడదని బ్రిటన్, షెఫీల్డ్ విశ్వవిద్యాలయంలోని డిజిటల్ మీడియా అధ్యాపకురాలు డాక్టర్ ప్రీతి రఘునాథ్ అభిప్రాయపడ్డారు. 'తెలంగాణలో కృత్రిమ మేధ విధానాలు, మౌలిక సదుపాయాలు, అభ్యాసాలు: ప్రారంభ ముద్రలు' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లో బుధవారం ఆమె పలు అంతర్దృష్టులను పంచుకున్నారు.

రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘునాథ్ తన పైలట్ పరిశోధన అధ్యయనం ప్రారంభ ఫలితాలను సదస్యులకు వివరించారు. ముఖ్యంగా, నిజామాబాద్, హైదరాబాద్ నుంచి రెండు కీలక కేస్ స్టడీలను ఆమె ప్రముఖంగా ప్రస్తావిస్తూ, తెలంగాణలో కృత్రిమ మేధ యొక్క సంక్లిష్ట దృశ్యాన్ని ఆవిష్కరించారు. ఈ స్థానిక ఉదాహరణలను జాతీయ, అంతర్జాతీయ ఏఐ అభివృద్ధి యొక్క విస్తృత చట్రాలలో పరిశీలించారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో తెలంగాణ పథం యొక్క క్లిష్టమైన విశ్లేషణలను డాక్టర్ రఘునాథ్ అందించారు. జీవనోపాధి, అభివృద్ధి మధ్య సంక్లిష్ట పరస్పర చర్య, సామాజిక-పర్యావరణ పరిగణనలు, దక్షిణ అర్ధగోళంలో (గ్లోబల్ సౌత్) అభివృద్ధి చెందుతున్న దేశాల యొక్క చిక్కులను వివరించారు. ఆర్థిక వృద్ధి, స్థిరమైన అభివృద్ధి మధ్య సమతుల్యత, ఏఐ ప్రపంచ కథనంలో స్థానిక సందర్భాలను గుర్తించడం యొక్క ప్రాముఖ్యతలను ప్రస్తావించారు. చారిత్రక వ్యాపారం-సాంకేతిక కథనాలను గుర్తించడం, యూరో-అమెరికన్ దృక్కోణాలను దాటి వెళ్లడం, సాంకేతిక పురోగతిలో ప్రత్యక్ష అనుభవాలను అర్థం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.



తొలుత, జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ అతిథిని ఆహ్వానించి, విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ జి.అశోక్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

# పలు రకాల పాములు అడవిలో విడుదల చేసిన ప్రాణధార స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్



కొత్తగూడెం పరిసరాల్లోని పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వచ్చిన పాములను సమాచారం మేరకు ప్రాణదార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ వెళ్లి పట్టుకొని, ప్రజలకు పాము నుండి సమస్య పరిష్కరించి వారికి అవగాహన కల్పించి బుధవారం ఆయా పాములను సుదూర అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాలో జనావాసాల మధ్య పాముల సంచారం ఎక్కువగా ఉంటుందని ప్రజలు అవగాహన కలిగి ఉండటం అవసరమని ఈ సందర్భంగా సంతోష్ వివరించారు.

# డాక్టరేట్ అందుకున్న భూక్య హుస్సేన్ నాయక్





కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగంలో భూక్య హుస్సేన్ నాయక్ డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. నిజాం కాలం నాటి బంజారా ప్రజల సంక్షేమ పథకాల గురించి పీహెచ్డీలో మంచి పరిశోధన ఫలితాలను ఆచార్య సదానందం గారి పర్యవేక్షణలో పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. మారుమూల గిరిజన ప్రాంతం నుంచి ఎంతో కష్టపడి ఉన్నతమైన విద్యను అభ్యసించినందుకు బంజారా సంఘాలు హుస్సేన్ నాయక్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విఎన్ నాయక్, రిటేడ్ పోరిక జవహర్ లాల్ నాయక్, రిటైర్డ్ డిఇఓ, బానోత్ వెంకట్రాం నాయక్ రిటైర్డ్ ఆర్జెడి, పోరిక నందానాయక్ రిటైర్డ్ జిఎం, కేలోతు సత్యమ్మ మాజీ జెడ్పిటిసి, అజ్మీర భోజ నాయక్ డి.సిహె.చ్, భూక్య సాంబు నాయక్ ఫారెస్ట్ రేంజర్, బంజారా జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకన్న నాయక్, సీనియర్ పాత్రికేయులు లావుడియా రాజు నాయక్, సిద్దు నాయక్, భాస్కర్ నాయక్, డాక్టర్ బానోత్ స్వామి నాయక్ మొదలగు బంజారా మిత్రులు హుస్సేన్ నాయక్ను అభినందించారు.

# లక్ష డప్పులు-వేల గొంతుల బహిరంగ సభను విజయవంతం చేయండి

## ఎం జె ఎఫ్ జిల్లా అధ్యక్షులు కనుకు వెంకటేశ్వర్లు



ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జర్నలిస్టు ఫోరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కనుకు వెంకటేశ్వర్లు, మేడి గుణ సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చెంగపొంగు సైదులు కోరారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన మాదిగ జర్నలిస్టు ఫోరం సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన మాదిగ జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ప్రతి మాదిగ జర్నలిస్ట్ డప్పుతో ఈ సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ అమలులో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని సుప్రీం కోర్ట్ ఆదేశాలకు అనుగుణంగా తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సభకు తరలివచ్చే ప్రతి జర్నలిస్ట్ డప్పుతో రావాలన్నారు. జిల్లాలోనే కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, అశ్వరావుపేట, ఇల్లందు డివిజన్లోనే అన్ని మండలాల జర్నలిస్టులు భారీ సంఖ్యలో తల్లి రావాలని కోరారు. ఈ సమావేశంలో మాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా కోశాధికారి వాసాల సంపత్, జిల్లా నాయకులు దాట్ల రవీందర్, ఇల్లందుల దుర్గయ్య, ప్రతాప్ రాజ్ కుమార్, మొగిలిపాక మురళి, సురేందర్, కొప్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా కు పదవి విరమణ ఘన సన్మానం

## జవహర్ నగర్ మున్నూరు కాపు కమిటీ ఆధ్వర్యంలో



జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తాకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు పసుపులేటి వీర భాస్కరరావు మాట్లాడుతూ గత 5 సంవత్సరాల్లో జవహర్ నగర్ కు ఎన్నో అభివృద్ధి పనులు చేశారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ విరమణ అనేది పదవికి కానీ ప్రజల కు సేవ చేయడానికి కాదని ఎల్లప్పుడూ ప్రజలకు సేవ చేయడానికి ప్రజల్లోనే ఉంటానని ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించే దిశగా పని చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. గత ఐదు సంవత్సరాలు నాకు సహకరిస్తూ సేవ చేసే భాగ్యం కలిగించినందుకు నాయకులకు ప్రజలకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కాపు సంఘం అధ్యక్షులు పసుపులేటి వీర భాస్కరరావు, సింగన బాల్రాజ్ పటేల్,ఏ సత్యనారాయణ, విట్టల్, మాధవ్ పటేల్,బొందల వెంకటరత్నం, కాపు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

KR TV క్రాంతి



# సంక్షేమ పథకాల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలి.

● పీఎం కూసుమ్ పథకం లో సోలార్ పవర్ ప్లాంట్ స్థాపనకు అనువైన భూములు గుర్తించాలి.. ● వేసవిలో త్రాగునీటి కొరత రాకుండా తగిన చర్యలు చేపట్టాలి...


● క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన మొక్కలను నాటాలి..

● జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.




(క్రాంతిన్యూస్ ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ వోలు మరియు సంబంధిత అధికారులతో సంక్షేమ పథకాల అమలు, పీఎం కూసుమ్ పథకం, వేసవిలో నీటి కొరత రాకుండా తీసుకోవాల్సిన చర్యలు మరియు ప్లాంటేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల దరఖాస్తుల ఆన్ లైన్ లో ఇంకా నమోదు పూర్తి కానటువంటి గ్రామాల దరఖాస్తులను రేపు ఉదయం లోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. చర్ల 23, దుమ్ముగూడెం 23, అశ్వాపురం 3, మణుగూరు లో 7 మరియు బూర్గంపాడు లో 1 దరఖాస్తులు ఆన్లైన్ చేయవలసి ఉందని వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లో కొత్తగా వచ్చిన 3403 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఉపాధి హామీ పథకంలో 20 రోజుల పని దినాల కంటే ఎక్కువ ఉన్నవారిని గుర్తించాలన్నారు. ఈ దరఖాస్తులను ఈనెల 31 తారీకు లోపు పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు. అదేవిధంగా తప్పుగా బ్యాంక్ అకౌంట్ లో నమోదైనటువంటి 29 దరఖాస్తులను వెంటనే సరైన బ్యాంక్ అకౌంట్ నెంబర్లను నమోదు చేయాలని ఆదేశించారు. కొత్త రేషన్ కార్డులకు గ్రామ సభలు మరియు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత పట్టిక ద్వారా వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఆ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయడం ద్వారా అర్హులకు డిజిటల్ రేషన్ కార్డ్ మంజూరు చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క దరఖాస్తును క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

పీఎం కూసుమ్ పథకం అమలులో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రతి మండలంలో సబ్ స్టేషన్ వివరాలను తాసిల్దారులకు తెలియజేయడం ద్వారా వారు ఆ సబ్ స్టేషన్ కు 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి. పీఎం కూసుమ్ పథకం క్రింద సోలార్ పవర్ ప్లాంట్ స్థాపనకు నాలుగు ఎకరాల భూమి అవసరం ఉంటుందని, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ స్థాపన చేయడం వలన 90 శాతం సబ్సిడీ వస్తుందని కలెక్టర్ తెలిపారు. 3 కోట్ల పెట్టుబడిలో 90 శాతం రాయితీ వస్తుందని తెలిపారు. సోలార్ ప్లాంట్ నిర్వహణ ద్వారా సంవత్సరానికి 50 లక్షల ఆదాయం మహిళా సమాఖ్య కు వస్తుందని తెలిపారు. ఏపీవోలు ఆసక్తి గల మహిళా సమాఖ్య సంఘాలను గుర్తించాలని తెలిపారు. ప్రతి మండలంలో ఒక సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పవర్ ప్లాంట్ స్థాపనకు మన జిల్లాకు 150 ఎకరాల లక్ష్యం ఇచ్చిందని తెలిపారు. వేసవిలో నీటి కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా పంచాయతీ అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి లభ్యత, నీటి సరఫరా లో సమస్యలను గుర్తించి పది రోజుల్లోగా సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. గుత్తి కోయిల ఆవాసాలను, గిరిజన గూడెం లను ప్రత్యేకంగా గుర్తించడం ద్వారా వారికి త్రాగునీటి కొరత రాకుండా సోలార్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. హరితహారం లో నాటే మొక్కలు ప్లాంటేషన్ లక్ష్యాలు మరియు సాధించిన ప్రగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా కలెక్టర్ క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగపడేటటువంటి మొక్కల ప్లాంటేషన్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్ప, ముష్టి గింజలు, తంగేడు, మునగ, సుబాబులు, సిస్సు ,టకోమో మరియు మందారం తదితర మొక్కలను నాటడం ద్వారా గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్లాంటేషన్ లో ఎదిగిన మొక్కలను వెంటనే అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో నాటాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, పిడి హౌసింగ్ శంకర్, జీఎం ఇండస్ట్రీస్ తిరుపతయ్య, ఎల్ డి ఎం రామిరెడ్డి, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి,సెర్ప్ పిడి నీలేష్, అడిషనల్ డిఆర్డిఓ రవి మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రామవరం వాసి సౌదీ అరేబియాలో మృతి

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,29 జనవరి (క్రాంతిన్యూస్ ): జై బునిసా బేగం వయసు 64 సంవత్సరాలు రామవరం భద్రాది కొత్తగూడెం కు చెందిన ఆవిడ పవిత్ర ఉమ్రా కోసం ఐదుగురు హైదరాబాద్ నుంచి సౌదీ అరేబియా మక్కా మదీనాకు వచ్చినారు. జై బునిసా బేగం ఆరోగ్యము క్షీణించడం తో మదీనాలో హాస్పిటల్లో జాయిన్ చేశారు తాను 25వ తారీకు ఒకటో నెల 2025 సంవత్సరం రోజు తుదిశ్వాస విడిచారు. ఈ విషయము వీరి కుటుంబ సభ్యుల ద్వారా సౌదీ అరేబియాలో ఉంటున్న సామాజిక కార్యకర్త అయిన అబ్దుల్ రఫీక్ తెలుసుకొని కేరళకు చెందిన మదీనాలో నివసిస్తున్న షరీఫ్ కి తెలియజేయడం జరిగింది. గ్రూప్ సభ్యుడు అన్సార్ ఆలం పేరుమీద ఆథరైజేషన్ ఇంటి సభ్యుల ద్వారా ఇప్పియడం జరిగింది. జిద్ద కౌన్సిలేట్ యొక్క సహకారంతో ఈరోజు మదీనాలో ఈమె అంతక్రియలు జరిగినాయి. ఇంటి కుటుంబ పెద్ద చనిపోవడం వలన ఇంటి కుటుంబ సభ్యులందరూ శోకసముద్రంలో మునిగిపోయారు.




# గద్దర్ పై కపట ప్రేమ చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

చెన్నరావుపెట,29 జనవరి (క్రాంతిన్యూస్ ):ఈ రోజు నర్సంపేట పట్టణ కేంద్రంలోని అమరవీరుల స్థూపం దగ్గర




భారతీయ జనతా పార్టీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్,నర్సంపేట రూరల్ మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, గారి ఆధ్వర్యంలో నిన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మొండి వైఖరితో, అసమర్థ పాలనతో నిన్న కేంద్ర హోం సహాయక శాఖ మంత్రివర్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు బండి సంజయ్ కుమార్ గారి దిష్టిబొమ్మను దహనం చెయ్యగ దాని నిరసిస్తూ వారి మొండి వైఖరిని ఎండగడుతూ ఈరోజు నిరసన వ్యక్తం చేసి అలాగే కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు 66 అబద్ధాల హామీలతో గద్దెనెక్కి ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ కృషి చేస్తే దానికి కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డు ఎంపిక చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతున్నారు అన్ని తెలియచేశారు, పుట్టినప్పటి నుండి చచ్చే వరకు ఓటు వేయని వ్యక్తి అలాగే ప్రజాస్వామ్యంతో నడిచే దేశంలో ఉంటూ ప్రజాస్వామ్యాన్ని నమ్మని వ్యక్తి గద్దర్ కు పద్మశ్రీ ఇవ్వబోమని తెలియజేసిన బండి సంజయ్ గారి దిష్టి బొమ్మను దహనం చేయడం సిగ్గుచేటు అని అలాగే గద్దర్ మీద వున్న 35 కేసులు కాంగ్రెస్ పార్టీ పెట్టినవే అని ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలనకు నిదర్శనమని తెలియజేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేని యెడల ప్రజల తరపున నిలబడుతూ రాబోయే రోజుల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని నిరసన కార్యక్రమాలను ఉద్రిక్తం చేస్తామని భారతీయ జనతా పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గం కన్వీనర్ వడ్డేపల్లి నరసింహారాములు, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు కూనమల్ల పృథ్వీరాజ్, సీనియర్ నాయకులు రవీందర్ సింగ్ (చిన్న), నర్సంపేట నియోజకవర్గం యువ మోర్చా నాయకులు జూలూరి మనీష్ గౌడ్ నల్లబెల్లి మండల అధ్యక్షులు తడుక వినయ్, దుగ్గొండి మండల అధ్యక్షులు నేదుర రాజేందర్ ఖానాపూర్ మండల అధ్యక్షులు రాధారపు అశోక్, నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అశోక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిల్ల రామచందర్, దుంక దువ్వ రంజిత్, బొద్దిరెడ్డి ప్రతాప్ రెడ్డి, జిల్లా మహిళా నాయకురాలు సూత్రపు సరిత, జిల్లా యువ మోర్చా నాయకులు, నర్సంపేట నియోజకవర్గ బిజెపి నాయకులు, సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# శ్రీ ముత్యలమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పణ



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,29 జనవరి (క్రాంతిన్యూస్ ):శ్రీ ముత్యలమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పణ పాల్వంచ పట్టణంలోని గాంధీ నగర్ ఐదో వార్డ్ లో వేంచేసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి కేశపురం జగన్నాధపురం గ్రామం మధ్యలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం పెద్దమ్మ తల్లి గుడి ఆలయం కమిటీ సభ్యులు బుధవారం పట్టు వస్త్రాలు సమర్పించారు పెద్దమ్మ గుడి డైరెక్టర్లలు ఎస్ పవీ ఆర్ కె ఆచార్యులు పెద్దమ్మతల్లి ప్రధాన అర్చకులు రమేష్ అయ్యగారు పురోహితులు ఇంజమూరి మురళి విశ్వ హిందు జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు , పండు కృష్ణార్జున రావు ,ఎం రంగమ్మ, ఎస్ రమాదేవి ముత్యాలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు గుడి పూజారి భాస్కర్ దాస్ ఆలయ ధర్మకర్త గంగాపూర్ నాగేశ్వరావు కొత్తపల్లి సోమయ్య కేసు పాక వెంకటేశ్వర్లు, రాంబాయమ్మ , లక్ష్మి, అరుణ, భద్రమ్మ , నాగమ్మ తదితరులు పాల్గొన్నారు

# గుండె పోటుతో అంతర్గాం మండల ప్రజా పరిషత్ అధికారి మహమ్మద్ అబ్దుల్ అలీమ్ కన్నుమూత



రామగుండం,29 జనవరి (క్రాంతిన్యూస్ ): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మండల ప్రజా పరిషత్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ అబ్దుల్ అలీమ్ గత రెండు మూడు రోజుల నుండి గుండె నొప్పితో బాధపడుతుండడంతో బుధవారం ఉదయం అతని ఇంటి నుండి హైదరాబాదు హాస్పటల్ తరలిస్తుండగా ప్రజ్ఞాపూర్ మార్గమధ్యలో మరణించడంతో అతనిని పెద్ద పెల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు తీసుకువచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచి అక్కడ పెద్ద పెల్లి జిల్లా కలెక్టర్,కలెక్టర్ ఆఫీస్ సిబ్బంది. అంతర్గాం మండల ప్రజా పరిషత్ అధికారులు,సిబ్బంది, పలువురు ప్రముఖులు అతని కుటుంబాన్ని ఆసుపత్రి వద్ద కలిసి పరామర్శించి అతనికి సంతాపం తెలియజేశారు. అనంతరం తన సొంత ఊరు అయినటువంటి కాగజ్ నగర్ కు అతని మృతదేహాన్ని తరలించారని అంతర్గాం మండల ప్రజా పరిషత్ సూపరిండెంట్ కర్ణాకర్ తెలిపారు.

## అంతర్గాం మండల్ ఎమ్ పి డి ఓ మహమ్మద్ అబ్దుల్ అలీం గుండెపోటుతో మరణించగా వారి పార్థివా దేహాన్ని సందర్శించిన-ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




రామగుండం,29 జనవరి (క్రాంతిన్యూస్ ):అంతర్గాం మండల పరిషత్ ఆఫీసులో ఎమ్ పి డి ఓ గా బాధ్యతలు నిర్వహిస్తున్న మహమ్మద్ అబ్దుల్ అలీం గుండెపోటుతో మరణించగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వారి పార్థివా దేహాన్ని సందర్శించి అలీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారులిఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు

# కారం, పసుపు ఎక్కువగా తింటే ఎక్కువకాలం బతుకుతారా?

హెల్త్ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్): కారం, పసుపు, ఇతర మసాలా దినుసుల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, రోగనిరోధక శక్తిని పెంచే సామర్థ్యం కూడా వాటిలో ఉందని తరచుగా వింటుంటాం. మరి నిజంగానే వీటన్నింటి వల్ల మన ఆరోగ్యానికి అదనపు ప్రయోజనాలు లభిస్తున్నాయా?

**మనం ఆరోగ్యంగా ఉండేందుకు ఇవి సాయపడుతున్నాయా?**

చిప్స్‌లో మిరియాల పొడి చల్లుకోవడం, టీ లో అల్లం వేసుకోవడం, దాదాపు అన్ని రకాల వంటల్లో మిరపకాయలను వాడటం– ఇలా మసాలా దినుసులు వేల సంవత్సరాలుగా మన ఆహారంలో భాగంగా ఉన్నాయి. అయితే, ఈ మధ్య కాలంలో కొన్ని మసాలా దినుసులు రోగాలను నయం చేసే 'సూపర్ ఫుడ్స్' అనే ప్రచారం అనధికారికంగా జరుగుతోంది.



2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం సమయంలో, హిల్లరీ క్లింటన్ అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు రోజూ ఒక మిరపకాయ తిన్నారు.

ఆసియాలో వేల సంవత్సరాలుగా ఉపయోగిస్తున్న పసుపు, "గోల్డెన్ లాటే" కాఫీ రూపంలో ప్రపంచవ్యాప్తంగా కెఫేల్లోకి అడుగు పెట్టింది. పసుపు రోగనిరోధక శక్తిని పెంచుతుందన్న వీడియోలు కోవిడ్ మహమ్మారి సమయంలో బాగా వైరల్ అయ్యాయి. ఇప్పుడు అన్నిచోట్లా పసుపు ఒక 'సెలబ్రిటీ షెఫ్'గా మారింది.

బరువు తగ్గడానికి మంచి సాధనంగా ఒక దశాబ్దం క్రితం బాగా ప్రచారం జరిగిన "బియాన్సే డైట్" (ఎర్ర మిర్చి, మేపుల్ సిరప్, నిమ్మకాయ నీరు కలిన మిశ్రమం) ఇప్పటికీ చాలా మంది తీసుకుంటున్నారు.

**అయితే, మసాలా దినుసులతో నిజంగా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయా?** అనారోగ్యాన్ని దూరం చేయడంలో ఇవి మనకు సహాయపడతాయా? హాని కలిగించే మసాలా దినుసులు కూడా ఉంటాయా? పరిశోధనలు ఏం చెబుతున్నాయి? వివరంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**మిరపతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు**

మిరపకాయలను మన వంటకాలలో విస్తృతంగా ఉపయోగిస్తాం. ఆరోగ్యంపై వీటి ప్రభావాలను అనేక అధ్యయనాలు పరిశీలించాయి. అయితే ప్రయోజనకరమైన ఫలితాలతో పాటు, ప్రతికూల పరిణామాలనూ కనుగొన్నారు.

మిరపలో ప్రధానంగా క్యాప్సైసిన్ అనే రసాయనం ఉంటుంది. మిరపకాయలను తిన్నప్పుడు, ఈ రసాయనం మన శరీరంలో ఉష్ణోగ్రత సృష్టించడానికి మెదడుకు సంకేతాలను పంపుతుంది. క్యాప్సైసిన్ ఎక్కువ కేలరీలను ఖర్చు చేసేందుకు సహాయపడుతుందిని, ఆకలిని తగ్గించగలదని అనేక అధ్యయనాలు కూడా చెబుతున్నాయి.

మనిషి ఎక్కువ కాలం జీవించడానికి క్యాప్సైసిన్ సాయపడుతుందని చెబుతారు.

మిరపకాయలను ఎప్పుడూ తినని వారితో పోలిస్తే వారానికి నాలుగు సార్లు మిరపకాయలతో కూడిన ఆహారాన్ని తినే వ్యక్తులు మరణించే ప్రమాదం తక్కువ అని 2019లో ఓ ఇటాలియన్ అధ్యయనం తేల్చింది.

2015లో చైనా పరిశోధకులు దాదాపు 5,00,000 మందిపై మిరపకాయ తినడం వల్ల కలిగిన ప్రభావాన్ని పరిశీలించిన్నపుడు కూడా ఇదే తేలింది. వారానికి ఒకసారి స్పైసీ ఫుడ్స్ తినే వారి కంటే దాదాపు ప్రతిరోజూ స్పైసీ ఫుడ్స్ తినే వారు మరణించే ప్రమాదం 14 శాతం తక్కువ అని అప్పుడు పరిశోధకులు చెప్పారు.

**జ్ఞాపకశక్తిపై ప్రభావం ఉంటుందా?**

"మసాలా ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధుల కారణంగా సంభవించే మరణాల ప్రమాదం తక్కువ" అని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో న్యూట్రిషన్ పరిశోధకుడు ప్రొఫెసర్ లు క్వి అన్నారు.

అయితే, మిరపకాయలను పెద్ద మొత్తంలో తినడం ప్రారంభిస్తే ఆరోగ్యానికి వెంటనే మేలు కలుగుతుందని, కొద్ది రోజుల్లోనే మన రోగ నిరోధక వ్యవస్థ మెరుగుపడుతుందని, శ్వాసకోస సబంధిత అనారోగ్యం దూరమవుతుందని అర్థం కాదు.

చైనా అధ్యయనంలో కనీసం ఏడేళ్లపాటు మిరపకాయలను ఆహారంలో భాగం చేసుకున్నవారిపైనే నిర్వహించారన్న విషయం మర్చిపోకూడదు. మిరపకాయలు ఆరోగ్యాన్ని సంరక్షించడమన్నది నిజమే కానీ, వాళ్లలా ఆరోగ్యంగా మారడమన్నది వారాలు, నెలల వ్యవధిలో జరిగిపోలేదు.

క్యాప్సైసిన్ మన శక్తిని పెంచుతుందని, ఆకలిని తగ్గిస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

మిర్చి వినియోగం అధిక రక్తపోటును నియంత్రించగలదని, ఊబకాయం బారిన పడకుండా రక్షిస్తుందని ఖతార్ యూనివర్శిటీ మానవ పోషకాహార విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ జుమిన్ షి తన అధ్యయనంలో తేల్చారు.

అయితే, మిరప వినియోగాన్ని, ఆలోచనాశక్తిని పోల్చిచూస్తే.. ఎక్కువ మిరపకాయలు తినేవారి ఆలోచనా తీరులో మార్పును చైనా పరిశోధకులు గమనించారు. ప్రధానంగా జ్ఞాపకశక్తిపై తీవ్ర ప్రభావం ఉంది.

తమ జ్ఞాపకశక్తి క్షీణించిదని స్వయంగా అధ్యయనంలో పాల్గొన్నవారే అన్నారు.

రోజుకు 50 గ్రాముల కంటే ఎక్కువ మిరపకాయలు తీసుకోవడం వల్ల జ్ఞాపకశక్తి క్షీణించే ప్రమాదం దాదాపు రెట్టింపు అని జుమిన్ షి నిర్ధరించారు.

అయితే, క్యాప్సైసిన్, స్పైసీ ఫుడ్ తినడం వల్ల కలిగే



ఆరోగ్య ప్రభావాలపై 11 అధ్యయనాలను 2022లో పరిశీలించి, అధ్యయనాల నాణ్యత అంతంత మాత్రంగానే ఉందని, ఫలితాలు కూడా అస్పష్టంగా ఉన్నాయని ఒక విశ్లేషణ నిర్ధరించింది.

**పసుపుతో ప్రయోజనాలు**

పసుపు ఆరోగ్యానికి మేలు చేస్తుందని చాల మంది నమ్ముతారు. పసుపులో కర్క్యుమిన్ అనే పదార్థం ఉంటుంది. పసుపును సాధారణంగా వాపును తగ్గించడానికి, ఇతర అనారోగ్య పరిస్థితులకు ప్రత్యామ్నాయ వైద్యంగా ఉపయోగిస్తారు. పసుపుతో ప్రయోజనం ఉంటుందని చెప్పడానికి సరిపడా ఆధారాలు మాత్రం లేవు.

కర్క్యుమిన్‌కు క్యాన్సర్‌ను నిరోధించే సామర్థ్యం ఉందని ప్రయోగశాలల్లో నిర్వహించిన అనేక అధ్యయనాల్లో తేలింది. అయితే ప్రయోగశాల వాతావరణం, మానవ శరీరం మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది.

కర్క్యుమిన్ కలిగించే ప్రయోజనాలపై ఆధారాలు లేవు. మసాలా దినుసులకూ ఇది వర్తిస్తుంది. అలాగే కొన్నిమసాలాల్లో లభించే పదార్థాల సప్లిమెంట్ల ఆరోగ్య ప్రయోజనాలపై పరిశోధకులు అధ్యయనం చేసినప్పుడు అనుకూలమైన ఫలితాలే వచ్చాయి. ఉదాహరణకు, లూపస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లతో సహా అటో–ఇమ్యూన్ వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు రోజు అల్లం తీసుకోవడం వల్ల వాపును నియంత్రించవచ్చని 2023లో నిర్వహించిన అధ్యయనంలో తేలింది.

"పసుపు సహా మసాలా దినుసులను ప్రత్యామ్నాయ ఔషధంగా ఉపయోగించాలన్న ఆసక్తి పాశ్చాత్య సమాజంలో వందేళ్లకు ముందే కనిపించింది. అప్పట్లో మసాలా దినుసులను చికిత్సకు ఉపయోగించవచ్చన్న ఆలోచన ఉండేది" అని యేల్ యూనివర్సిటీ హిస్టరీ ప్రొఫెసర్ పాల్ ఫ్రీడ్‌మాన్ చెప్పారు.

**సమతుల్యం కోసం మసాలా దినుసులు**

"ఆహారంలో సమతుల్యం కోసం మసాలా దినుసులను ఉపయోగిస్తారు. వేడి, చల్లని, తేమ, పొడి వంటివాటిని ఇవి సమతుల్యం చేస్తాయి" అని ఫ్రీడ్‌మ్యాన్ చెప్పారు. చేపను చల్లని, తడి ఆహారం అనుకుంటే మసాలా దినుసులు ఆ ఆహారంలోకి కావాల్సిన వేడిని అందిస్తాయి.

ఆహారాన్ని ఔషధంగా ఉపయోగించడం, వేడి, చల్లదనం, పొడి, తడి వంటివాటిని సమతుల్యపరచడం వంటివి ఆయుర్వేద వైద్యం ప్రధాన సిద్ధాంతాలు. భారత్‌లో వేల ఏళ్లుగా ఇది ఉపయోగిస్తున్నారు.

చాలా పాశ్చాత్య దేశాల్లో సమతుల్య ఆహారాన్ని కొత్త రకం 'వైద్యం'గా ఉపయోగించడమన్నది ఇప్పుడు కొత్తగా వినపడతోందని ఫ్రీడ్‌మాన్ చెప్పారు. "50 ఏళ్ల కిందటితో పోలిస్తే మసాలా దినుసులను 'ఔషధం'లా ఉపయోగించడం ఇప్పుడు ఎక్కువగా ఉంది. ఒకప్పుడు యాంటిబయాటిక్స్ వంటి ఆధునిక వైద్యం, ప్రాచీన వైద్యం మధ్య ఒకప్పుడు కనిపించే గోడ ఇప్పుడు లేదు" అని ఆయనన్నారు.

యూనివర్శిటీ ఆఫ్ మిన్నెసోటాలో పనిచేసిన మాజీ రీసెర్చ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాథరిన్ నెల్సన్.. కొత్త ఔషధాలలా మసాలా దినుసులు పనికొస్తాయా అన్నది పరిశీలించాలని భావించారు. కర్క్యుమిన్ చుట్టూ ఉన్న వాదనలపై అధ్యయనం చేయాలని ఆమె నిర్ణయించుకున్నారు.

"టెస్ట్ ట్యూబ్‌లలో పెరిగే కణాలపై పరిశోధనలు చేయాలని భావించారు. కానీ కర్క్యుమిన్ దాని అణువులు జీర్ణమైన తర్వాత శరీరం వాటిని ఉపయోగించుకోదని ఆమె గుర్తించారు. కర్క్యుమిన్‌ను చిన్న పేగు సులభంగా గ్రహించదు. చిన్నపేగు, పెద్ద పేగుల్లోని ప్రొటీన్లతో కర్క్యుమిన్ కలిసినప్పుడు దాని నిర్మాణం మారిపోతుంది. ఫలితంగా కర్క్యుమిన్‌తో పెద్దగా కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు" అని కాథరిన్ అన్నారు.

"పసుపులో ప్రయోజనకరమైనది ఏదైనా పదార్థం ఉండవచ్చు. కానీ, అది కర్క్యుమిన్ కాదు" అని ఆమె అన్నారు. పసుపును వంట తయారిలో వాడితే, ఇతర ఆహారపదార్థాలతో పాటు కలిసిపోతుంది. చాలా పసుపు వాడడం అనేది ప్రమాదకరం కాదు. కానీ సొంత వైద్యానికి దానిని ఉపయోగించకపోవడమే మంచిది" అని ఆమె చెప్పారు.

**ప్రభావాలకు గల కారణాలేంటి?**

మిరప, పసుపుపై విస్తృత అధ్యయనాలు జరిగినప్పటికీ, వాటిని వాడడం వల్ల ఆరోగ్యంపై కలిగే అనేక రకాల ప్రభావాలను మాత్రమే ఆ అధ్యయనాలు పోల్చిచూపుతున్నాయి. ప్రభావాలకు గల కారణాల్ని అధ్యయనాలు కచ్చితంగా నిర్ధరించలేదు. ఇది చాలా కష్టం కూడా. ప్రయోగశాలలో వచ్చిన ఫలితాలు మానవ శరీరానికి పూర్తి స్థాయిలో వర్తించకపోవచ్చు.

2019లో జరిగిన ఇటాలియన్ అధ్యయనం విషయానికే వస్తే, మిరపకాయల వినియోగం వల్ల మరణం ముప్పు తగ్గుతుందని తేలింది. ఇది ఒక పరిశీలన మాత్రమే. అయితే మిరపకాయలు మనుషులు ఎక్కువ కాలం జీవించేలా చేస్తాయా లేదా అన్నది తెలుసుకోవడం అసాధ్యం. ఇప్పటికే ఆరోగ్యంగా ఉన్న వారు మిరపకాయలను ఎక్కువగా తింటున్నవారా లేక.. వారి ఆరోగ్యానికి మరింకేదైనా కారణం ఉన్నదా? అన్నది తేల్చలేం.

వాస్తవానికి మసాలాల ఆరోగ్య ప్రయోజనాలు, మనం వాటితో పాటు తినే ఆహారం నుంచి వస్తాయని చాలా మంది పరిశోధకులు నమ్ముతారు.

"మసాలా దినుసులు ఆహారాన్ని రుచికరంగా మారుస్తాయి. ఆరోగ్యం విషయంలో ఉప్పుకు అవి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి" అని న్యూయార్క్‌లోని NYU లాంగోన్ హెల్త్ మెడికల్ సెంటర్‌లో క్లినికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లిపి రాయ్ చెప్పారు.

ఉప్పు, కొవ్వుపదార్థాలు వంటి వాటికి బదులుగా మసాలా దినుసులను వాడటం వల్ల ప్రఖ్యాత వంటలను ఎక్కువ మంది ఆస్వాదిస్తారని గత సంవత్సరం పరిశోధకులు నిర్వహించిన ప్రయోగంలో తేలింది.

మిరపకాయలను కూరగాయలతో కలిపి తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

మసాలా దినుసులు మనకు ఎలాంటి హాని చేయనప్పటికీ, జబ్బుల బారిన పడకుండా తప్పించుకోడానికి మనం వాటిపైనే ఆధారపడకూడదు. ఆయా సీజన్లలో దొరికే కూరగాయలతో వాటిని కలిపి తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# ఇలా చేస్తే బెల్లీ ఫ్యాట్ ఈజీగా కరిగి పోతుందట

హెల్త్ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్):మనలో చాలా మంది అందంగా, సన్నగా కనపడడాలని చూస్తుంటారు. ముఖ్యంగా నాజూకైన నడుమును సొంతం చేసుకోవడానికి అనేక మార్గాల్లో ప్రయత్నిస్తుంటారు. వ్యాయామాలు చేయడం, ఆహారంలో మార్పులు చేసుకోవడం ఇలా ఎన్నో కసరత్తులు చేస్తుంటారు. అయితే, వీటితో పాటు ఈ చిట్కాలు పాటిస్తే ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**రాత్రి భోజనం ఇలా!**

ముఖ్యంగా రాత్రుళ్లు పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందే భోజనం ముగించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అప్పుడే తీసుకున్న ఆహారం పూర్తిగా జీర్ణమవుతుందని అంటున్నారు. అలాగే శరీరంలో, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోకుండా కూడా జాగ్రత్తపడచ్చని సూచిస్తున్నారు. ఫలితంగా నాజూకైన నడుమును సొంతం చేసుకోవచ్చని సలహా ఇస్తున్నారు.

**ఎలాంటి ఆహారం?**


నాజూకైన నడుమును సొంతం చేసుకోవాలంటే రోజు తీసుకునే ఆహారంలో ఈ మార్పులు చేసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే తక్కువ క్యాలరీలు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. జంక్‌ఫుడ్, వేపుళ్లు, చాక్లెట్లు పక్కన పెట్టేయాలని.. పండ్లు, కూరగాయలు, గుడ్లు, చేపలు మొదల్కెనవి తినడం అలవాటు చేసుకోవాలని అంటున్నారు. ఇంకా మోనోఅన్‌శ్యాచురేటెడ్ కొవ్వులు మన శరీరానికి ఎంతో అవసరమని చెబుతున్నారు. అందుకే ఇవి ఎక్కువగా



లభించే గింజలు, అవకాడో వంటివి తినడం వల్ల శరీరానికి అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులు అందడంతో పాటు బరువును కూడా అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. ప్రొటీన్లు ఎక్కువగా లభించే బీన్స్, నట్స్‌ని ఆహారంలో చేర్చుకుంటే ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉంటుందంటున్నారు. ఫలితంగా ఆహారపు కోరికల్ని అదుపులో ఉంచుకోని.. బరువునూ నియంత్రించుకోవచ్చని సూచిస్తున్నారు.

**ఈ వ్యాయామాలు!**

బరువు తగ్గడమే కాకుండా.. నడుము నాజూగ్గా మారేలా చేయడంలో వ్యాయామాలదీ కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వారానికి ఐదు రోజులు రోజూ కనీసం అరగంట పాటు కార్డియో ఎక్సర్‌సైజులు చేయడం అలవాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఉదయం నిద్ర లేచిన తర్వాత కనీసం 20 నిమిషాల పాటు వాకింగ్ లేదా రన్నింగ్ చేయాలని సలహా ఇస్తున్నారు. ఈ వ్యాయామాలు మనల్ని చురుగ్గా మార్చడంలోనూ సహకరిస్తాయని అంటున్నారు. ఇంకా డ్యాన్స్ చేయడం, ఈత కొట్టడం, సైక్లింగ్ వంటివి కూడా నడుము ఆకృతిని మార్చడంలో సహకరిస్తాయని వెల్లడిస్తున్నారు. 2019లో International Journal of Obesityలో ప్రచురితమైన "The Effects of Aerobic Exercise on Visceral Fat in Overweight and Obese Adults: A Systematic Review" అనే అధ్యయనంలోనూ ఈ విషయం తేలింది. ఇంకా హార్వర్డ్ మెడికల్ పబ్లిషింగ్ అధ్యయనంలో బయటపడింది .



# క్రీడలు





## ఐసీసీ ర్యాంకింగ్స్ లో మెరిసిన వరుణ్ చక్రవర్తి





స్పోర్ట్స్ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్ ): ఇంగ్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టీ20లో ఐదు వికెట్ల పడగొట్టిన భారత జట్టు లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐసీసీ టీ20 ఇంటర్నేషనల్ ర్యాంకింగ్స్‌లో టాప్-5కి చేరుకున్నాడు. ఏకంగా 25 స్థానాలు ఎగబాకి తొలిసారిగా ఐదో ప్లేస్‌కి చేరుకున్నాడు. అదే సమయంలో భారత స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్‌ని అధిగమించాడు. టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

**ఆ ఘనత సాధించిన మూడో భారత బౌలర్..**

ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి బంతితో అద్భుత ప్రదర్శన చేశాడు. అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో రెండోసారి ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఘనత సాధించాడు. దాంతో టీ20ల్లో భారత్ తరఫున ఒకటి కంటే ఎక్కువసార్లు ఐదు లేదంటే అంతకన్నా ఎక్కువ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా నిలిచాడు. ఇంతకు ముందు భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్ ఈ ఘనత సాధించారు. 2018లో దక్షిణాఫ్రికా, 2022లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన టీ20ల్లో భువనేశ్వర్ ఐదు వికెట్లు తీశాడు. 2018లో ఇంగ్లాండ్, 2023లో దక్షిణాఫ్రికాపై కుల్దీప్ యాదవ్ వికెట్లు పడగొట్టాడు. వరుణ్ గతేడాది దక్షిణాఫ్రికాలో 17 పరుగులు ఇచ్చి ఐదు వికెట్ల కూల్చాడు.

**అగ్రస్థానానికి ఆదిల్ రషీద్**

ఇంగ్లాండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ భారత్‌తో జరుగుతున్న సిరీస్‌లో బంతితో రాణించాడు. దాంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. రషీద్ 2023లోనూ అగ్రస్థానానికి చేరుకోగా.. తాజాగా వెస్టిండిస్ బౌలర్ అకిల్ హుస్సేన్‌ని అధిగమించి అగ్రస్థానానికి చేరాడు. 718 రేటింగ్ పాయింట్ల రషీద్ ఖాతాలో ఉన్నాయి. అకిల్ హుస్సేన్ రెండో స్థానంలో ఉండగా.. శ్రీలంక ఆటగాడు వనిందు హసరంగ మూడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటి వరకు ఇంగ్లాండ్‌తో ఆడిన మూడు మ్యాచుల్లో 108 పరుగులు చేశాడు. ఇందులో ఓ హాఫ్ సెంచరీ ఉన్నది. దాంతో కెరియర్‌లో తొలిసారిగా ఐసీసీ ర్యాకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. 832 పాయింట్లతో బ్యాటర్స్ ర్యాకింగ్‌లో రెండో స్థానానికి చేరాడు. ఇక ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ 855 పాయింట్లతో నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు.

**ఆల్ రౌండర్లలో పాండ్యా హవా..**

ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా జోరు కొనసాగుతున్నది. ప్రస్తుతం పాండ్యా నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. 255 పాయింట్లతో అగ్రస్థానాన్ని ఆక్రమించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో ఇప్పటి వరకు 50 పరుగులు చేయడంతో పాటు ఐదు వికెట్లు తీశాడు. అదే సమయంలో అక్షర్ పటేల్ టాప్-12లో కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు 17 పరుగులు చేసి ఐదు వికెట్లు తీశాడు.

## టెస్టుల్లో స్టీవ్ స్మిత్ 10,000 పరుగులు.. 15వ బ్యాటర్‌గా రికార్డు

స్పోర్ట్స్ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్ ):అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్ చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో పది వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఆ ఘనతను అందుకున్న 15వ బ్యాటర్ అయ్యాడు. దీంతో ఎలైట్ క్రికెటర్ల జాబితాలో చేరాడతను. ఇండియాతో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్ సమయంలో.. స్మిత్ పది వేల పరుగుల మైలురాయికి ఒక్క పరుగు దూరంలో నిలిచాడు. అయితే ఇవాళ శ్రీలంకతో ప్రారంభమైన టెస్టులో ఆ మైలురాయి దాటేశాడు.




టెస్టుల్లో పది వేల రన్స్ చేసిన బ్యాటర్లలో 15వ ప్లేయర్‌గా నిలిచాడతను. ఆస్ట్రేలియా తరఫున నాలుగవ బ్యాటర్ అయ్యాడు. గతంలో పది వేల రన్స్ చేసిన ఆసీస్ బ్యాటర్లలో రికీ పాంటింగ్(13,378), అలన్ బోర్డర్(11,174), స్టీవ్ వా(10,927) ఉన్నారు. టెస్టుల్లో లీడింగ్ రన్ స్కోరర్‌గా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. అతను 15,921 రన్స్ చేశాడు.లంకతో జరుగుతున్న గాలే టెస్టులో.. తాజా సమాచారం ప్రకారం .. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 60 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 261 రన్స్ చేసింది. ఖవాజా 119, స్టీవ్ స్మిత్ 64 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు.

## అక్షిత పసిడి జోరు



స్పోర్ట్స్ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్): గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ టోర్నీలో యాచారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అక్షిత సత్తాచాటింది. ఒకటి కాదు రెండు కాదు మూడు బంగారు పతకాలు సొంతం చేసుకుని శభాష్ అనిపించుకుంది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం సాకలోనిపల్లి గ్రామానికి చెందిన అక్షిత యాచారం ప్రభుత్వ హాస్టల్‌లో వుంటూ 10వ తరగతి చదువుతున్నది. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ 100మీ. 200మీ రేసుల్లో స్వర్ణాలు సాధించిన అక్షిత.. లాంగ్‌జంప్‌లోనూ మరో పసిడి దక్కించుకుంది. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా చెన్నై వేదికగా ఫిబ్రవరిలో జరిగే జాతీయ పారా అథ్లెటిక్స్ టోర్నీకి అక్షిత ఎంపికైంది.

## కివీస్ ఆల్‌రౌండర్‌కు ఐసీసీ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు



స్పోర్ట్స్ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్ ): న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ మెలీ కెర్‌ను.. ఐసీసీ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. ప్రతిష్టాత్మకమైన రేచల్ హేహో ఫ్లింట్ ట్రోఫీకి ఆమె ఎంపికైంది. 2024లో అద్భుతమైన మహిళా క్రికెటర్‌గా ఆమె రికార్డుకెక్కింది. క్రికెట్‌కు చెందిన మూడు ఫార్మాట్లలో కెర్ గత ఏడాది అద్భుత ప్రదర్శన ఇచ్చింది. రేచల్ హేహో ఫ్లింట్ అవార్డు కోసం లౌరా వోల్వార్ద్, చామరి ఆటపట్టు, అన్నాబెల్ సుదర్‌లాండ్ పోటీపడ్డారు. కానీ కివీస్ క్రికెటర్‌ను ఆ అవార్డు వరించింది.

మూడు ఫార్మాట్లలోనూ ఆమె వరల్డ్‌క్లాస్ ఆల్‌రౌండర్‌గా నిలిచింది. ప్రపంచంలోని మేటి మహిళా లెగ్ స్పిన్ బౌలర్‌గా కెర్ కీర్తికెక్కింది. బ్యాటింగ్‌లోనూ కివీస్ లైనప్‌ను మరింత పటిష్టం చేసింది. మిడిల్ ఆర్డర్‌లో బలమైన బ్యాటర్‌గా కీలక ఇన్నింగ్స్ ఆడింది. రేచల్ హేహో ఫ్లింట్ ట్రోఫీ అవార్డును 2017 నుంచి ప్రకటిస్తున్నారు. ఎలిసీ పెర్రీ(ఆస్ట్రేలియా), స్మృతి మందాన(ఇండియా), స్కీవర్ బ్రంట్(ఇంగ్లండ్) ఇప్పటి వరకు ఈ అవార్డును గెలుచుకున్నారు.

రేచల్ అవార్డును గెలుచుకున్న తొలి కివీస్ ప్లేయర్‌గా కెర్ నిలిచింది. ఐసీసీ మహిళా క్రికెటర్ అవార్డును కూడా గెలవడం కివీస్ క్రికెటర్‌కు ఇదే మొదటిసారి. 2024లో 9 వన్డేలు ఆడిన కెర్.. వాటిల్లో 33 సగటుతో 264 రన్స్ చేసింది. ఆ ఫార్మాట్‌లో 14 వికెట్లు కూడా తీసింది. టీ20 మ్యాచుల్లో అద్భుత ప్రదర్శన ఇచ్చిన కెర్ 18 మ్యాచుల్లో 387 రన్స్ స్కోర్ చేసింది. ఆ తర్వాత 29 వికెట్లను కూడా తీసుకున్నది. మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో అత్యధికంగా 15 వికెట్లు తీసుకున్నది.


## భవిష్యత్‌లో త్రిష మరింత రాణించాలి..

### ఎమ్మెల్సీ కవిత ఆకాంక్ష



స్పోర్ట్స్ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్ ):మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్ టోర్నీలో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. ప్రపంచ స్థాయిలో త్రిష సత్తా చాటడం మనందరికీ గర్వకారణం. భవిష్యత్తులో త్రిష మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. మలేషియాలో జరుగుతున్న అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ పోరులో త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) 53 బంతుల్లోనే శతకం బాది ఈ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన క్రికెటర్‌గా తన పేరును రికార్డుల పుస్తకాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుంది. త్రిషతో పాటు మరో ఓపెనర్ కమిలిని (42 బంతుల్లో 51, 9 ఫోర్లు) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే.

## రైల్వేస్‌తో రంజీ మ్యాచ్‌కు వేగంగా సన్నద్ధమవుతున్న విరాట్ కోహ్లీ



స్పోర్ట్స్ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్ ): భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దాదాపు 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ రంజీ మ్యాచ్ ఆడబోతున్నాడు. నేడు ఢిల్లీ , రైల్వేస్ జట్ల మధ్య ప్రారంభం కానున్న రంజీ మ్యాచ్‌లో.. కోహ్లీ ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ నేపథ్యంలో రైల్వేస్‌తో రంజీ మ్యాచ్ కోసం వేగంగా సన్నద్ధమవుతున్నాడు. మంగళవారమే అరుణ్ జైట్లీ స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాడు. బుధవారం కూడా ఉదయాన్నే స్టేడియానికి చేరుకుని ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ప్రాక్టీస్ చేస్తూ ఉత్సాహంగా కనిపించాడు. కోహ్లీ తీరు చూస్తుంటే చాన్నాళ్ల తర్వాత ఆడబోతున్న రంజీ మ్యాచ్ కోసం ఉవ్విళ్లూరుతున్నట్లు కనబడుతోంది. కోహ్లీ రంజీ మ్యాచ్ ఆడేందుకు సిద్ధం కావడంతో ఢిల్లీ టీమ్ మేనేజ్‌మెంట్ అతనికి కెప్టెన్సీ ఆఫర్ చేసింది. కానీ కోహ్లీ ఆ ఆఫర్‌ను తిరస్కరించాడు. యువ కెప్టెన్ ఆయుష్ బదోనీ కెప్టెన్సీలో ఆడేందుకే మొగ్గు చూపాడు. కాగా రంజీ ట్రోఫీ గ్రూప్-డి లో ఢిల్లీ.. ఒక గెలుపు, రెండు ఓటములు, మూడు డ్రాలతో ఆరో స్థానంలో ఉన్నది. సౌరాష్ట్రతో జరిగిన గత మ్యాచ్‌లో ఢిల్లీ 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇండియన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా సౌరాష్ట్ర తరఫున 12 వికెట్లు తీసి ఢిల్లీని దెబ్బకొట్టాడు. జడేజా తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు పడగొట్టాడు. కాగా 36 ఏళ్ల విరాట్ కోహ్లీ 2012 ఉత్తరప్రదేశ్‌లో తన ఆఖరి రంజీ మ్యాచ్ ఆడాడు. ఇప్పుడు మళ్లీ ఆడబోతున్నాడు.

# బాలకృష్ణతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు.. ఏజ్ గ్యాప్‌పై ప్రగ్యా జైస్వాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



మూవీ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్ ): మిర్చి లాంటి కుర్రాడు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది జబల్ పూర్ సుందరి ప్రగ్యా జైస్వాల్ . ఆ తర్వాత వరుణ్ తేజ్‌తో నటించిన కంచె సినిమాతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటించిన లెజెండ్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇటీవలే మరోసారి బాలకృష్ణతో కలిసి డాకుమహారాజ్‌లో మెరిసింది ప్రగ్యా జైస్వాల్. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం మంచి టాక్ తెచ్చుకుంది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో సీనియర్ హీరో బాలకృష్ణతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయడం, నటీనటుల మధ్య ఏజ్ గ్యాప్ గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది ప్రగ్యా జైస్వాల్. ఆయన ఒక లెజెండ్, బాలకృష్ణ పేరు చెప్పగానే నాకు పాజిటివిటీ అనే పదం గుర్తొస్తుంది. ఆయన దగ్గర నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. బాలకృష్ణ అందరినీ ఒకేలా గౌరవిస్తారు.. చాలా మంచి మనిషి. పాత్రకు తగ్గట్టుగా యాక్టర్లను సెలెక్ట్ చేస్తారు తప్ప వారి వయస్సును చూసి సినిమా అవకాశాలివ్వరంది.

నా పాత్రకు వందశాతం న్యాయం చేశానా..? లేదా అనేదే ఆలోచిస్తాను. నా దృష్టిలో వయస్సు అనేది అసలు సమస్యే కాదు. అఖండలో మా ఇద్దరినీ స్క్రీన్‌పై చూసి షాకయ్యానంటూ చెప్పుకొచ్చింది. డాకు మహారాజ్ థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి అంతా నన్ను డాకు మహారాణి అని పిలుస్తున్నారు. ఆ పాత్రకు ప్రేక్షకులు అంతలా కనెక్ట్ అయ్యారు. ఒక నటిగా ఇది నాకెంతో సంతృప్తినిచ్చే విషయమంది ప్రగ్యా జైస్వాల్. ఈ భామ బాలకృష్ణతో మరోసారి అఖండ 2 సినిమాలో కూడా నటిస్తోంది.

# తనతోనే రిలేషన్‌షిప్‌లో ఉన్నానని చెప్పకనే చెప్పింది..!




మూవీ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్ ): అగ్ర తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న రిలేషన్‌లో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. అయితే తామిద్దరం మంచి మిత్రులం మాత్రమేనని ఈ జంట అనేక సందర్భాల్లో స్పష్టం చేశారు. అయినా వారిద్దరి రిలేషన్‌కు సంబంధించిన వార్తలు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రష్మిక మందన్న తన భాగస్వామి గురించి మాట్లాడిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానని కన్‌ఫర్మ్ చేసిన రష్మిక మందన్న.. భాగస్వామి పేరును మాత్రం చెప్పడానికి ఇష్టపడలేదు. ఇదే ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది రష్మిక మందన్న. ఈ ప్రపంచంలో తన ఇల్లు అత్యంత అనందకరమైన ప్రదేశమని చెప్పింది. 'సక్సెస్, ఫెయిల్యూర్స్ వస్తూపోతుంటాయి. కానీ ఇల్లు ఇచ్చే ఆనందం శాశ్వతం. నేను ఎప్పటికీ ఓ బాధ్యత కలిగిన కుమార్తెను, సోదరిని, భాగస్వామిని కూడా. వీరి చుట్టూ కలబోసిన జీవితానికి నేను ఎంతో విలువిస్తాను' అని రష్మిక మందన్న చెప్పింది. ఈ ఇంటర్వ్యూలో తన భాగస్వామి గురించి రష్మిక మందన్న ప్రత్యేకంగా ప్రస్తావించడంతో తన ప్రేమ వ్యవహారం గురించి చెప్పకనే చెప్పిందని సోషల్‌మీడియాలో నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

# నేను తెలంగాణ వాడినే.. హాలీవుడ్ సింగర్ వ్యాఖ్యలపై స్పందించిన విజయ్ దేవరకొండ





మూవీ న్యూస్,29 జనవరి(క్రాంతిన్యూస్ ): ప్రపంచ ప్రఖ్యాత మ్యూజిక్ బ్యాండ్ 'కోల్డ్ ప్లే' ఇండియా టూర్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తి అయిన విషయం తెలిసిందే. ఇండియాలోని అగ్ర నగరాలైన ముంబైతో పాటు అహ్మదాబాద్ లో ఈ కన్సర్ట్ జరుగగా.. సూపర్ రెస్పాన్స్ రావడంతో పాటు ఈ వేడుకకు సింగర్ శ్రేయ ఘోషల్‌తో పాటు పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలు హాజరై సందడి చేశారు.

ఇదిలావుంటే అహ్మదాబాద్ లో జరిగిన కన్సర్ట్‌లో తాను తెలంగాణ వాడి నేనని క్రిస్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన ఈవెంట్‌లలో తాను ఎక్కడికి వెళితే అక్కడ ఆ ప్రాంతంకి చెందిన వాడినని క్రిస్ చెబుతుంటాడు. ఇండియా కన్సర్ట్‌లో కూడా తాను తెలంగాణ వాడినని.. తమ బ్యాండ్‌కు చెందిన సభ్యులంతా భారత్‌కు చెందినవారేనని చెప్పుకోచ్చాడు. అయితే క్రిస్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నువ్వు మా తెలంగాణ ముద్దు బిడ్డవి అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.

తాజాగా ఈ విషయంపై నటుడు విజయ్ దేవరకొండ కూడా స్పందించారు. ఇన్‌స్టా వేదికగా రాసుకోస్తూ.. వెల్‌కమ్ క్రిస్ మార్టిన్. జై బోలో తెలంగాణ సినిమాలోని పొడుస్తున్న పొద్దు మీద సాంగ్‌తో పాటు, కోల్డ్ ప్లే మీద ఎవరైనా మ్యాషప్ చేస్తే బాగుంటుంది అని విజయ్ రాసుకోచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ కామెంట్ వైరల్‌గా మారింది.

# ట్రంప్ నిర్ణయంపై కన్నీళ్లు పెట్టుకున్న హాలీవుడ్ నటి

మూవీ న్యూస్,29 జనవరి (క్రాంతిన్యూస్ ): అక్రమ వలసదారులను తమ దేశం నుంచి సాగనంపుతానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం తనను బాధపెట్టిందంటూ హాలీవుడ్ నటి సెలీనా గోమెజ్ అవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఒక వీడియోను పోస్ట్ చేసిన ఆమె కాసేపటికే ఆ వీడియోను డీలిట్ చేసింది. అక్రమ వలసదారులు అమెరికాలోకి రాకుండా.. చట్టం చేస్తామంటున్న ట్రంప్ ప్రకటనపై అభ్యంతరం వ్యక్తం చేసింది. నన్ను క్షమించండి. ”నా ప్రజలు గాయపడుతున్నారు. నేను సహాయం చేయాలనుకుంటున్నాను, కానీ నాకు ఎలా చేయాలో తెలియదు. నేను నా వంతు ప్రయత్నం చేస్తానని మీ అందరికీ హామీ ఇస్తున్నాను అంటూ చెప్పుకోచ్చింది. అయితే ఈ వీడియోపై కొంతమంది ట్రోల్ చేయగా మరికొంతమంది ఆమెకు మద్దతుగా నిలిచారు. కాగా డీలీట్ చేసిన వీడియోను మీరు కూడా చూసేయండి.




Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com